ఉష్ణోగ్రత (అంచనా)

30-4-2025	గరిష్టం	కనిష్టం
గుంటూరు	40	27
తెనాలి	39	28
నరసరావుపేట	41	28
బాపట్ల	37	28
రెంటచింతల	41	28

- పునఃశంకుస్థాపన మహోత్సవానికి భారీ ఏర్పాట్లు
- ప్రధాని రానుండటంతో ప్రతిష్ఠాత్మకంగా కార్యక్రమం
- మోదీకి అత్యద్భుతంగా ఆహ్వానం పలికేందుకు సన్నాహాలు
- వెలగపూడిలో ఏర్పాట్లపై పరిశీలన.. సమీక్షల్లో మంత్రులు
- బహిరంగ సభ విజయవంతానికి గ్రామ స్థాయి నుంచి ప్రణాళికలు



పార్కింగ్ ప్రదేశాలను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ, కలెక్టర్ నాగలక్ష్మి, ఐజీ త్రిపాఠి, వీరపాండ్యన్, జేసీ భార్గవ తేజ



ఏర్పాట్ల గురించి కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీలు, సతీష్‌కుమార్, మలికా గార్గ్‌లతో చర్చిస్తున్న హోం మంత్రి అనిత



సిద్ధమైన వేదిక

అదిరేలా.. అమరావతి సభ





వేదిక ప్రాంతంలో రోడ్డుకిరువైపులా పచ్చదనం



తనిఖీ చేస్తున్న డాగ్ స్క్వాడ్

భారీగా ఏర్పాట్లు.. అత్యద్భుతంగా కార్యక్రమాలు.. వినూత్నంగా స్వాగత సన్నాహాలు.. మొత్తమ్మీద అదిరేలా అమరావతి పునః శంకుస్థాపన మహోత్సవం నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తోంది. శుక్రవారం మధ్యాహ్నం ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాజధాని అమరావతి పనులకు పునః శంకుస్థాపన.. ఆ తర్వాత జరిగే బహిరంగ సభ కార్యక్రమాలకు అటు మంత్రులు.. ఇటు అధికారులు ప్రత్యేకంగా బాధ్యతలు స్వీకరించారు. నిరంతరం సమీక్షలు.. ఏర్పాట్ల పరిశీలనలో నిమగ్నమయ్యారు. శుక్రవారం వెలగపూడి వద్ద జరుగుతున్న ఏర్పాట్లను మంత్రులు అనిత, నారాయణ అధికారులతో కలిసి ప్రత్యేకంగా పరిశీలించారు. దాదాపు ఏర్పాట్లు కొలిక్కి వచ్చినట్లు వారు ప్రకటించారు. ఇక గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో గ్రామ స్థాయి నుంచి అమరావతి సభకు జన సమీకరణపై అటు అధికారులు, ఇటు స్థానిక నేతలు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేకంగా సన్నాహాలు చేస్తున్నారు. రాజధాని అమరావతి పరిధిలోని గ్రామాల్లో కుటుంబ సమేతంగా తరలి రావాలని అధికారులు రైతులకు అహ్వాన పత్రికలను ఇంటింటికి తిరిగి అందజేస్తున్నారు.

తుళ్లూరు(వెలగపూడి), గుంటూరు, కార్పొరేషన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అత్యద్భుతంగా అమరావతిని తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం పునః శంకుస్థాపనను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. శుక్రవారం ప్రధానమంత్రి మోదీ ఆధ్వర్యంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, బహిరంగ సభకు వెలగపూడి సచివాలయం సమీపంలో భారీగా ఏర్పాట్లు చేసింది. పండుగ వాతావరణంలో కార్యక్రమం జరుపుకునేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆయా ఏర్పాట్లు, సభకు జనసమీకరణలపై అటు అధికారులు, ఇటు మంత్రులు ప్రత్యేకంగా బాధ్యతలు తీసుకున్నారు. మోదీ హాజరుకానుండటంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం విజయవంతాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ఏర్పాట్లు చేస్తోంది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల నుంచి సభకు హాజరయ్యే ప్రతి ఒక్కరికి తాగునీరు, మజ్జిగ, భోజనం వంటి సదుపాయాలకు ఎక్కడికక్కడ ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతీ వార్డు కి ఒక ఇన్‌చార్జిని నియమించారు. ప్రజల రవాణా కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. శుక్రవారం ఏర్పాట్లను మంత్రులు నారాయణ, వంగలపూడి అనితలు పరిశీలించారు. ఏర్పాట్లు ఒక కొలిక్కిరాగా ఇప్పటికే కేంద్ర రక్షణ బలగాలు రంగంలోకి దిగాయని మంత్రి అనిత తెలిపారు. వేదిక, పార్కింగ్ ప్రాంతాలు, వేదిక వద్దకు చేరుకునే మార్గాలను మంత్రి నారాయణ పరిశీలించారు. బుధవారం కల్లా ఏర్పాట్లన్నీ పూర్తి అవుతాయని చెప్పారు. మంత్రుల వెంట వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ వీరపాండ్యన్, కలెక్టర్ నాగలక్ష్మి, ఐజీ త్రిపాఠి, ఎస్పీ సతీష్‌కుమార్, ఏఎస్పీ సుప్రజ ఉన్నారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు

అమరావతి పునః శంకుస్థాపన కార్యక్రమానికి తరలి వచ్చే ప్రజలకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి బీసీ జనార్ధనరెడ్డి తెలిపారు. రాజధానిలో కార్యక్రమ ఏర్పాట్లపై మంగళవారం ఆయన గుంటూరు నగర పాలక సంస్థ కౌన్సిల్ హాలులో సమీక్షించారు. రాజధాని నిర్మాణ పనుల పునః ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి పండుగ వాతావరణంలో అపూర్వ స్వాగతం పలికే కార్యక్రమంలో ప్రతి పౌరుడు భాగస్వామి అయ్యేందుకు ఉత్సాహంగా ఉన్నారన్నారు. సభకు హాజరయ్యే ప్రజలను తరలించేందుకు వాహనాలు సమకూర్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యేలు అమర్నాథ్‌రెడ్డి, రామాంజనేయులు, నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, ఏలూరు సాంబశివరావు, గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్ర (నాని), ఏపీఎంఐడీసీ ఛైర్మన్ డేగల ప్రభాకర్, రాష్ట్ర లిడ్‌క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యాలరావు అమరావతిలో జరిగే కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనరు పులి శ్రీనివాసులు, డిప్యూటీ మేయరు సజీలా, ఏసీ ఓబులేషు, ఏఎస్పీ రమణమూర్తి, డీటీసీ సీతారామిరెడ్డి, ఆర్టీసీ ఆర్ఎం కృష్ణకాంత్, డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి, మెప్మా పీడీ విజయలక్ష్మి, కార్పొరేటర్లు, అదికారులు పాల్గొన్నారు.

ఆకుపచ్చని ఆహ్వానం

పూలమొక్కలతో ప్రత్యేకంగా ముస్తాబు

అమరావతి వస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఘన స్వాగతం పలికేందుకు అమరావతి అభివృద్ధి సంస్థ(ఏడీసీ) ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తోంది. పచ్చని మొక్కలతో రోడ్లు, హెలిప్యాడ్, వేదికకు వచ్చే మార్గాలను ముస్తాబు చేస్తోంది. సంస్థ ఛైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డీ.లక్ష్మీపార్థసారధి పలురకాల ప్రత్యేమైన మొక్కలు తెప్పించి అమరావతిని పచ్చదనంతో నింపేశారు. వేదిక వద్దకు చేరుకునే ఎన్-9 రోడ్డు ప్రవేశ ద్వారాన్ని ఖర్జూర చెట్లతో అందంగా తీర్చి దిద్దారు. వాటి మధ్య గడిచౌడి పూల మొక్కలను నాటారు. వేదిక పాయింట్ వద్ద పచ్చిక, బౌగెన్‌విల్లే, ప్లుమేరియా మొక్కలతో అందంగా తీర్చిదిద్దారు. మందడం గ్రామం వద్ద ప్రధాన రహదారికి ఇరు వైపులా పసుపు రంగు ఆకులతో కూడిన మొక్కలను వేశారు. దీంతో ఈ రహదారిలో అవి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. సీడ్ యాక్సెస్ రోడ్డును పచ్చికతో, గులాబీ రంగు లాగర్‌స్ట్రోమియా మొక్కలతో అలంకరించారు. మల్కాపురం ఉద్యానవనంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ల వద్ద రోడ్డును ఇరువైపులా బౌగెన్‌విల్లే కుండలతో అందంగా అలంకరించారు. సచివాలయ ప్రవేశ ద్వారాన్ని ఫికస్ పోండా, మాల్పిజియా కోన్లు, డ్రెస్సినియా మహాత్మా, ఖర్జూరపు చెట్లతో అందంగా అలంకరించారు.



64 సీసీ కెమేరాలతో నిఘా


ప్రధాన నరేంద్ర మోదీ పర్యటన నేపథ్యంలో 64 సీసీ కెమేరాలతో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు హోం మంత్రి అనిత తెలిపారు. సీసీ టీవీ కెమేరాలతో నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. సీసీ టీవీ కెమెరాలతో నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. ఆరు వేల మంది పోలీసులతో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. వీఐపీలు, ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. అమరావతి నిర్మాణం అనేది ఆంధ్ర ప్రజల కల అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ఏకైక రాజధానిగా అమరావతి ఉండాలనే కాంక్షతో వైభవంగా పనులను పునః ప్రారంభించుకోవడంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్, రాష్ట్ర ప్రజలు, రైతుల కష్టం, రాజధాని మహిళల ఆవేదన ఉందన్నారు. అమరావతి పున:నిర్మాణానికి ప్రధాని రావడాన్ని రాష్ట్ర ప్రజలందరూ పండుగ వాతావరణంలో జరుపుకోవడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

రాజధాని గ్రామాల్లో ఇంటింటికీ ఆహ్వానం

పండుగలా అమరావతి రాజధాని పునః నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తుంది. ఈ క్రమంలో రాజధాని గ్రామాల్లోని ప్రజలను ఈ కార్యక్రమానికి ప్రత్యేకంగా ఆహ్వానం అందజేస్తోంది. ప్రధాని సభకు సకుటుంబ సపరివారంగా తరలి రావాలని ఇంటింటికీ తిరిగి ఆహ్వాన పత్రికలను అందజేసే బాధ్యతలను అధికారులు తీసుకున్నారు. ఈ మేరకు గ్రామాల వారీగా ప్రతీ ఒక్కరికి అమరావతి ఆహ్వాన పత్రికలను అందజేస్తున్నారు.



ఆహ్వాన పత్రం అందజేస్తున్న అధికారులు



అడిగినంత ఇస్తేనే బిల్లు

(తెనాలి ఆంధ్రజ్యోతి)

- లేదంటే కొర్రీల మీద కొర్రీలు
- ప్రశ్నిస్తే ఆడిట్ అని పక్కన పడేస్తారు
- ఏసీబీకి పట్టుబడినా తీరు మార్చుకోని ఉద్యోగి
- స్పెషల్ ఇంక్రిమెంట్ ఉత్తర్వుల అధికారం కలెక్టర్‌కు లేదట
- తెనాలి సబ్ ట్రెజరీలో ఓ సీనియర్ తీరుపై బాధితుల గగ్గోలు

ట్రెజరీ ఉద్యోగి: స్పెషల్ ఇంక్రిమెంటా! అయితే బాగానే వస్తుందిగా! మరి నా పరిస్థితేంటి? ఎంతిస్తావు.

ఉద్యోగి : ఎంతివ్వటమేంటండీ! అదేమీ ఊరికే రాలేదు. కష్టపడితే కలెక్టర్ స్పెషల్ ఇంక్రిమెంట్ ఆర్డర్ ఇచ్చారు. నేనేమీ ఇవ్వలేనండీ. బిల్ పాస్ చెయ్యండి. మీకు పుణ్యం ఉంటుంది.

ట్రెజరీ ఉద్యోగి : మాట్లాడితే కలెక్టర్ పేరుచెబుతావ్... కలెక్టర్ అంటే మేము భయపడిపోవాలా? అసలు కలెక్టర్‌కు ఆర్డర్ ఇచ్చే అధికారమే లేదు. అది తీసుకొచ్చి నీ నసేంటి! ఆడిట్‌కు రాస్తున్నాలే. వచ్చినప్పుడు తీసుకుందువుగాని.. వెళ్లు.

- తెనాలి సబ్ ట్రెజరీ కార్యాలయంలో ఏ బిల్ కావాలన్నా, అది ముందుకు కదలాలన్నా ఆ సీనియర్ ఉద్యోగి చేతులు తడపాలనేందుకు ఇటీవల చోటుచేసుకున్న ఈ ఘటన ఓ నిదర్శనం. చేయి తడపకుంటే బిల్లుల విషయంలో కొర్రీలు వేస్తాడు.. వాటా అందితే మళ్లీ సరిచేస్తాడు.. లేదంటే అంతే సంగతులు. ఈయనతో గొడవెందుకని మరెవరితోనైనా చేయించుకుంటే ఇక ఆ ఉద్యోగి ఆయన హిట్ లిస్ట్‌లో చేరినట్లే. అంతా తిరిగి ఆయన దగ్గరకే వెళితే ఇప్పట్లో నీ పనికాదు.. నేను చెయ్యను. నువ్వు నా హిట్ లిస్ట్‌లో ఉన్నావంటూ తిప్పుకుంటూ ఉండటం ఆయన ప్రత్యేకత. బిల్లుల కోసం ఆ కార్యాలయానికి వెళ్లేవారు సాధారణ జనం కాదు. ఇతర శాఖల్లో పనిచేస్తూ బిల్లులకోసం, ఇంక్రిమెంట్‌ల కోసం వెళ్లేవారు తోటి ఉద్యోగులన్న కనికరం కూడా ఆయనకు లేదు. అదేమంటే.. మీరు లంచం తీసుకోకుండానే పనిచేస్తున్నారా? మేము అడిగితేనే బాధేస్తోందా! అంటూ ఎదురు మాటల దాడికి దిగడం ఆయన ప్రత్యేకత. గతంలో ఏసీబీకి పట్టుబడినా ఆ ఉద్యోగిలో ఏ మాత్రం మార్పులేదన్న విమర్శలు వస్తున్నాయి. తెనాలి సబ్ ట్రెజరీ కార్యాలయంలో గతంలో ఓ ఉద్యోగి ఇతర ఉద్యోగుల బిల్లులను తన ఖాతాకు మళ్లించుకుని జల్సాలు చేసిన ఉదంతం తెలిసిందే. ఇదే తీరులో తర్వాత వచ్చిన సిబ్బందిలో కొందరు చేతివాటం చూపినవారూ ఉన్నారు. అయితే ప్రస్తుతం ఓ సీనియర్ ఉద్యోగి మున్సిపల్, రెవెన్యూ వంటి ఆదాయం దండిగా, బిల్లులు ఎక్కువగా ఉండే శాఖల బిల్లులే చూస్తూ వాటిని ఆదాయ మార్గాలుగా చేసుకున్నాడని ఆరోపణ. ఎంతటి వారయినా ఆ ఉద్యోగి వద్దకు బిల్ వెళ్తే ఆయన అడిగినంత ఇచ్చుకోవాల్సిందే.. లేకుంటే కొర్రి వేస్తాడు. ఓ బిల్ విషయంలో కొర్రీ వేయడంపై ఉన్నతస్థాయి అధికారి చెప్పినా పట్టించుకోలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. తెనాలి ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు సంబంధించి ఓ బిల్ విషయంలోనూ 10 శాతం ఇవ్వాలని డిమాండ్ చేయగా అంత ఇవ్వలేమని తేల్చి చెప్పడంతో దానిని పాస్ చెయ్యకుండా ఆడిట్‌కు పంపుతున్నానని కొర్రీవేసి పక్కన పడేశారనేది సిబ్బంది ఆవేదన. ఓ ఉపాధ్యాయుడిని రూ.లక్ష, ఆరోగ్యశాఖ ఉద్యోగిని రూ.70 వేలు, మున్సిపాల్టీలో ఓ చిరు ఉద్యోగిని రూ.35 వేలు లంచం కింద డిమాండ్ చేశారనేది ఆరోపణ. తాజాగా ఓ వీఆర్వోకు స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెంట్ మంజూరు చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇవ్వగా దానికి కూడా లంచం డిమాండ్ చేశాడంటే ఆ ఉద్యోగి తీరు అర్థం చేసుకోవచ్చు. పైగా అంత ఇవ్వలేనని ఆ వీఆర్వో చెప్పడంతో ఇష్టం వచ్చినట్లు దూషించినట్లు సమాచారం. కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు అండ ఉందని, తనను ఎవరూ ఏమీ చేయలేరని ఆ సీనియర్ చెలరేగుతున్నట్లు తెలుస్తోంది. గతంలో గుంటూరు ఏసీబీ పట్టుకున్నా ఆ కేసును కొట్టివేయించుకున్నాను.. నా స్థాయి ఏమిటో తెలుసుకోండని ఉద్యోగులను బెదిరించే ధోరణిలో హెచ్చరిస్తుంటాడని సమాచారం. తెనాలి ట్రెజరీలోని ఉన్నతాధికారికి, జిల్లా ట్రెజరీ కార్యాలయంలోని మరో ఉన్నతాధికారికి కూడా వాటాలివ్వాలి, మంగళగిరి నిధి భవన్‌లో ఉన్న మరొక ఉన్నతాధికారికి కూడా సమర్పించుకోవాలని బహిరంగంగానే అతడు చెప్తూ లంచాలు పెద్దఎత్తున వసూలు చేస్తున్నాడని బాధితులు చెబుతున్నారు.

అంతగా పీడించడం మంచిది కాదు.. ఇబ్బంది పడతారని తోటి ఉద్యోగులు హితవు చెప్పే ప్రయత్నం చేస్తే వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తాడని సమాచారం. ఏసీబీలోనూ చాలా మంది పరిచయస్తులు ఉంటారని కోతలు కోస్తుంటారని తోటి ఉద్యోగులు చెబుతున్నారు. ఏటీవో స్థాయి అధికారి కూడా తమకు తెలియదన్నట్లు ఉన్నారు.



తెనాలి సబ్ ట్రెజరీ కార్యాలయం

ఆధారాలు ఉంటే చర్యలు

నేను కొత్తగా బాధ్యతలు తీసుకున్నాను. సిబ్బందిని గాడిలో పెట్టేందుకు చర్యలు మొదలుపెట్టాం. సేవల విషయంలో ఎవరైనా నిర్లక్ష్యంగా ఉంటే ఉపేక్షించం. లంచాలు డిమాండ్ చేస్తున్నారని ఆధారాలు ఉంటే ఏ స్థాయి ఉద్యోగి అయినా చర్యలు తప్పవు. తెనాలి కార్యాలయంపై ప్రత్యేక దృష్టిపెడతాం.

- చంద్రశేఖరరెడ్డి, జిల్లా ఖజానాధికారి, గుంటూరు.

విద్యా వ్యవస్థలో సంస్కరణలు

- ఈ విద్యా సంవత్సరం నుంచే తల్లికి వందనం
- పది విద్యార్థుల అభినందన సభలో చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు
- మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతులు

నరసరావుపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో పలు సంస్కరణలు తీసుకుకొచ్చిందని చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. ఇటీవల విడుదలైన పది ఫలితాల్లో 580 మార్కులు సాధించిన సుమారు 92 మంది జిల్లా విద్యార్థులకు మంగళవారం నరసరావుపేటలోని భువనచంద్ర టౌన్ హాలులో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో అభినందన సభ జరిగింది. ఈ సభలో జీవీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థికి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం రావడం అభినందనీయమన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి తల్లికి వందనం పథకం అమల్లోకి వస్తుందని చెప్పారు. జిల్లాలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించిన ప్రభుత్వ పాఠశాలలకు శివశక్తి ఫౌండేషన్ ద్వారా ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. జిల్లా స్థాయిలో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.25 వేలు, తృతీయ స్థానం సాధించిన విద్యార్థికి రూ.15 వేల నగదు బహుమతిని శివశక్తి ఫౌండేషన్ తరపున జీవీ అందజేశారు. గ్రూప్-1, సివిల్స్ కు సమాయత్తం అవుతున్న పేద విద్యార్థులకు కూడా ఆర్థిక సహాయం అందజేస్తామని ప్రకటించారు. కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ విద్యార్థుల్లో కష్టపడే తత్వం ఉందని, అది వారి భవిష్యత్‌కు దారులు వేస్తుందన్నారు. పది ఫలితాల్లో కారంపూడిలో మంచి ఫలితాలు వచ్చాయని, బొల్లాపల్లి, మాచవరం, వెల్దుర్తి మండలాలు వెనుకంజలో ఉన్నాయన్నారు. రానున్న విద్యా సంవత్సరంలో ప్రారంభంలోనే విద్యార్థులకు మెటీరియల్ అందజేస్తామన్నారు. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తున్నారని ప్రశంసించారు. డే స్కాలర్లపై విద్యాశాఖ మరింతగా దృష్టి పెట్టాలన్నారు. మొదటి రెండు స్థానాల్లో నిలిచిన పావని చంద్రిక, షేక్ సమీరాలకు రూ.లక్ష, తృతీయ స్థానం సాధించిన ప్రత్తిపాటి అమూల్యకు రూ.50 వేల నగదు అందచేశారు. 85 శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల ఉపాధ్యాయులకు ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ మానవ వనరులు అభివృద్ధి చెందాలంటే విద్యా వ్యాప్తి జరగాలన్నారు. విద్యా వ్యాప్తికి రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీని ప్రకటించి 16,347 పోస్టులను భర్తీ చేస్తుందన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ కలెక్టర్ ప్రోత్సాహంతోనే జిల్లాలో విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో ఎల్.చంద్రకళ, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యేలు జూలకంటి, డాక్టర్ అరవిందబాబు

వెయ్యి బస్సులు.. 50 వేల జనం

- అమరావతి సభకు భారీగా జనసమీకరణ
- ఇన్‌చార్జిగా జేసీ సూరజ్.. ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగే అమరావతి రాజధాని పునర్నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి జిల్లా నుంచి భారీగా జనసమీకరణకు అధికారులు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా నుంచి 50 వేల మందిని తరలించేందుకు వెయ్యి బస్సులను ఏర్పాటు చేశారు. ప్రధాని మోదీ కార్యక్రమానికి సంబంధించి ప్రత్యేక అధికారిగా జేసీ సూరజ్‌ను నియమించారు. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు పీఎం సభకు తరలి వెళ్లేలా.. వారికి అవసరమైన భోజనం, తాగునీరు తదితర సౌకర్యాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ప్రధానంగా పెదకూరపాడు నియోజకవర్గం నుంచి అత్యధికంగా జన సమీ కరణపై దృష్టి సారించారు. గ్రామ, వార్డు స్థాయిలో ప్రజలను తర లించే బాధ్యతలను ప్రత్యేకంగా అధికారులను నియమించారు. ఈ నియోజకవర్గం నుంచి దాదాపు 20 వేల మంది తరలించనున్నారు. సభకు తరలివెళ్లే వారి కోసం పెదమద్దూరు, బోయపాలెం, నందిగామ ప్రాంతాల్లో భోజన కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. బస్సుల్లో కూడా తాగునీరు, అల్పాహారం అందించనున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొనే సభను విజయవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం సమాయత్తమైంది. ఆయా ఏర్పాట్లపై కలెక్టర్ అరుణ్‌బాబు శుక్రవారం ప్రత్యేకంగా సమీక్షించారు.

జాతీయస్థాయి ఎడ్ల పందేలకు క్వారీ సిద్ధం

● ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే ధూళిపాళ్ల

పొన్నూరుటౌన్(చేబ్రోలు), ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ధూళిపాళ్ల వీరయ్య చౌదరి మెమోరియల్ జాతీయస్థాయి ఒంగోలు జాతి వృషభ రాజాల బల ప్రదర్శనకు వడ్లమూడి బాలకోటేశ్వరస్వామి క్వారీ ప్రాంగణం సిద్ధం అవుతుంది. గురువారం నుంచి మే 8వ తేదీ వరకు ఎడ్ల పందేల నిర్వహణకు నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు. మొదటి రోజు టచ్ పళ్లు, 2న రెండు పళ్లు, 3న నాలుగు పళ్లు, 4న ఆరు పళ్లు, 5న న్యూ కేటగిరి, 6న సబ్ జూనియర్స్, 7న జూనియర్స్, 8న సీనియర్స్ విభాగంలో పోటీలు జరగనున్నాయి. జూనియర్స్ విభాగంలో రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ మొదటి బహుమతిగా ప్రకటించారు. ప్రతి విభాగంలో నగదు బహుమతులు, రూ.3 వేల నుంచి రూ.15 వేల వరకు కన్సోలేషన్ బహుమతులు ప్రదానం చేయనున్నారు. ప్రతి రోజు ఉదయం 9 గంటలకు డ్రా నిర్వహిస్తారు. పొన్నూరు నియోజకవర్గంలోనే తొలిసారిగా జాతీయస్థాయి ఒంగోలు జాతి బండ లాగుడు పోటీలు నిర్వహిస్తున్నారు. ఒంగోలు జాతి పశుపోషకులను ప్రోత్సహించేందుకు లక్ష్యంగా ఈ పోటీలులు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇప్పటికే పదుల సంఖ్యలో ఎకరాలను చదును చేశారు. ప్రేక్షకులు వీక్షించేలా గ్యాలరీలు ఏర్పాట్లు జరిగాయి. వేసవి దృష్ట్యా ఎడ్ల పోటీలను సాయంత్రం 5 నుండి రాత్రి 10 గంటల వరకు నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు.



లాగుడు బండలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్

ఎడ్ల బల ప్రదర్శన ప్రాంగణాన్ని మంగళవారం ఎమ్మెల్యే, సంగం డెయిరి చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పరిశీలించారు. బాలకోటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కొత్త బండలకు పూజలు చేశారు. ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని నిర్వాహకులను ఆదేశించారు.

దేశానికే రోల్ మోడల్‌గా వ్యవసాయ విశ్వవిద్యాలయం

● వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు
● వైభవంగా వర్సిటీ వజ్రోత్సవాలు



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, రాజశేఖర్, ఏలూరి సాంబశివరావు తదితరులు

లాంఫాం(తాడికొండ)ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో దేశానికే రోల్ మోడల్‌గా ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం మారిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం స్థాపించి 60 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా లాంఫాంలోని వర్సిటీలో రెండు రోజులపాటు జరగనున్న వజ్రోత్సవాలను మంగళవారం మంత్రి ప్రారంభించారు. నూతనంగా నిర్మిస్తున్న పరిపాలన భవనం వద్ద ఏర్పాటు చేసిన వర్సిటీ పైలాన్ ను, ఆచార్య ఎన్జీ రంగా కాంస్య విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం పరిపాలన భవనంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి, స్టాల్స్‌ను మంత్రి పరిశీలించారు. ముందుగా డ్రోన్ టెక్నాలజీని, డ్రోన్ల పనితీరును తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ 1964లో మూడు పూటలా తిండి దొరకక ప్రాణాలు పోయే పరిస్థితిని మార్చి.. మూడు పూటలా తిండి దొరికే స్థితికి తీసుకువచ్చింది ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అన్నారు. సాగులో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చే విధంగా శాస్త్రవేత్తలు పరిశోధనలు జరగాలని మంత్రి ఆకాంక్షించారు. పరిపాలన భవనం పూర్తి కావడానికి.. రూ.80 కోట్లు మంజూరు చేస్తామన్నారు. వ్యవసాయశాఖ ఎక్స్ అఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రటరి బి.రాజశేఖర్ మాట్లాడుతూ వ్యవసాయ విశ్వవిద్యాలయం అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. అనంతరం వ్యవసాయంపై విశ్వవిద్యాలయ పుస్తకాలను, సీడీలను విడుదల చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విశ్వవిద్యాలయం అభివృద్ధికి వ్యవసాయశాఖ కమిషనర్ డిల్లీరావు రూ.2 లక్షలు విరాళం ప్రకటించారు. వజ్రోత్సవాల్లో వీసీ డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మీదేవి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, ఏలూరి సాంబశివరావు, నాబార్డు మాజీ చైర్మన్ చింతల గోవిందరాజులు, మాజీ వీసీ డాక్టర్ టి. దామోదరనాయుడు, రైతునేస్తం ఫౌండేషన్ అధినేత వై.వెంకటేశ్వరావు,విశ్వవిద్యాలయం అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

ప్రధాని పర్యటనతో ఏపీ అభివృద్ధిలో నవశకం

● చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనతో అమరావతి, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో నవశకం ప్రారంభం కాబోతుందని ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఏపీ లీడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావుతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలోనే అమరావతి శంకుస్థాపన చేసి, రాష్ట్ర అభివృద్ధికి మోదీ చేయూత ఇచ్చారని గుర్తుచేశారు. జగన్ హయాంలోనే అవన్నీ ఆగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ అభివృద్ధి యజ్ఞంలా ప్రారంభించేందుకు మే 2న ప్రధాని మోదీ అమరావతికి రానున్నారని చెప్పారు. మోదీ సభ విజయవంతం చేయడానికి జన సమీకరణలో భాగంగా శుక్రవారం ఉదయం 9.30 గంటలకు నియోజకవర్గ వ్యాప్తంగా బస్సులు ఏర్పాటు చేస్తున్నామని, 5 వేల మందికి పైగా ఈ సభకు వచ్చేలా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పల్నాడు జిల్లా నుంచి 50 వేల మంది సభకు వస్తారని అంచనా అని పేర్కొన్నారు. ఉమ్మడి గుంటూరు డీసీసీబీ చైర్మన్‌గా మక్కెన మల్లికార్జునరావుకు అవకాశం ఇచ్చినందుకు సీఎంకు ఎమ్మెల్యే జీవీ ధన్యవాదాలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, కూటమి నాయకులు ఉన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

తీరు మార్చుకోకపోతే ఇంటికే..

● తాగునీటిపై సమీక్షలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేటలో తాగునీటి సమస్యపై ఎన్నిసార్లు చెప్పినా అధికారులు తీరు మార్చుకోకపోవడం పట్ల స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మంగళవారం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజల నుంచి వస్తున్న తాగునీటి ఫిర్యాదులపై స్పందించిన ఆయన మున్సిపల్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. నీటి సమస్యపై సమీక్షించారు. ప్రజలకు సకాలంలో తాగునీరు అందించలేనప్పుడు బాధ్యులను సహించేది లేదన్నారు. ఇదే ఆఖరి హెచ్చరిక అని, తీరు మార్చుకోకుంటే బాధ్యులైన వారిని సస్పెన్షన్ తో ఇంటికి పంపడం ఖాయమని స్పష్టం చేశారు. చెరువులో పుష్కలంగా నీరున్నా, ప్రజలకు అందకపోవడం ఎవరి తప్పిదమని ఆయన ప్రశ్నించారు. సమన్వయ లోపాలుంటే పరిష్కరించు కోవాలి గానీ, ప్రజల్ని ఇబ్బంది పెడతారా అని అసహనం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో వ్యవహరించినట్లుగానే.. ఈ ప్రభుత్వంలో కూడా పనిచేస్తామంటే కుదరదని స్పష్టం చేశారు. తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్న పండరీపురం, మద్దినగర్, వెంగళరెడ్డినగర్, 10వ వార్డు, 38వ వార్డులపై ప్రత్యేక దృష్టిపెట్టాలని సూచించారు. తానే స్వయంగా వార్డుల్లోకి అకస్మాత్తుగా వెళ్లి ప్రజలు స్పందన తెలుసుకుంటానని చెప్పారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు, డీఈ రహీం, ఆర్ డబ్ల్యూఎస్ అధికారులతో పాటు, కౌన్సిలర్లు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

చిన్న సినిమాలకు ఆదరణ కరువు : సినీనటి శివపార్వతి



భట్టిప్రోలు (కొల్లూరు), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత పరిస్థితుల్లో చిన్న సినిమాలకు ఆదరణ కరువైందని తెలుగు సినీ నటి, క్యారెక్టర్ ఆర్టిస్టు పోలిశెట్టి శివపార్వతి పేర్కొన్నారు. మండల పరిధిలోని పల్లెకోనలో జరుగుతున్న పరుచూరి రఘుబాబు 35వ స్మారక జాతీయ నాటకోత్సవాలలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ, నాటక రంగం గతంలో లాగ ఆదరణ నోచుకోలేకపోతుందన్నారు. తాను కూడా రంగ స్థలం నుండి తెలుగు చిత్ర పరిశ్రమకు ఎదిగినట్లు చెప్పారు. తెనాలిలో పుట్టి పెరిగిన తాను 1975 నుండి రంగస్థల కళాకారిణిగా అనేక నాటక ప్రదర్శనలు ఇచ్చినట్లు తెలిపారు. 1993లో పరుచూరి బ్రదర్స్ ఆశీస్సులతో సురేష్ ప్రొడక్షన్ అధినేత స్వర్గీయ రామానాయుడు, శోభన్‌బాబు హీరోగా నటించిన సర్పయాగం సినిమాతో తన సినీ రంగ ప్రవేశం జరిగిందన్నారు. అప్పటి నుండి సీనియర్ నటులు ఎన్టీఆర్, నాగేశ్వరరావు, శోభన్‌బాబు, కృష్ణ, కృష్ణంరాజు, చిరంజీవి, బాలకృష్ణ అగ్రహీరోల సినిమాలతో పాటు ఇప్పటివరకు 280 సినిమాల్లో నటించినట్లు పేర్కొన్నారు. పరుచూరి సోదరులు నాటక రంగ కళాకారులను ప్రోత్సహించడం కళాకారులకు వరం లాంటిదన్నారు.

మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిపై ఫిర్యాదు

రొంపిచర్ల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే అరవిందబాబుతో పాటు తనపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డిపై తెలుగు యువత నాయకుడు వడ్లమూడి వెంకట కిషోర్ మంగళవారం రొంపిచర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ మణికృష్ణకు ఫిర్యాదును అందజేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు జగ్గయ్య మాట్లాడుతూ అభివృద్ధికి మారుపేరుగా ఉన్న నరసరావుపేటలో ఈ విధంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడటం తగదని హితవు పలికారు. వడ్లమూడి వెంకట కిషోర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ విగ్రహం, టీడీపీ జెండా ఏర్పాటు చేయడం మాజీ ఎమ్మెల్యే జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో గాడిపర్తి సురేష్, పల్లెల నాగిరెడ్డి, లింగా వెంకటేశ్వర్లు, మొండితోక రామారావు, జాస్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఐ మణికృష్ణకు ఫిర్యాదు అందజేస్తున్న వడ్లమూడి వెంకట కిషోర్, టీడీపీ నాయకులు

సొంతిల్లు రాష్ట్ర ప్రజల ప్రధాన సమస్య

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇప్పటికి ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య ఇళ్లస్థలాలు వాటికి పట్టాలేనని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం నరసరావుపేటలో నూతనంగా నిర్మించిన సీపీఎం జిల్లా కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడారు. లక్షలాది మంది పేదలు రోడ్లు, కాల్వల పక్కన, ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారని చెప్పారు. వాళ్లందరికీ పట్టాలిస్తామని లేదా పట్టణాల్లో రెండు, గ్రామాల్లో మూడు సెంట్లు లెక్కన స్థలాలు ఇస్తామని ప్రభుత్వం వాగ్దానం చేసిందని గుర్తుచేశారు. నిరాశ్రయులందరికీ ప్రభుత్వం పట్టాలు లేదా ఇళ్ల ఇళ్లు కట్టించి ఇవ్వాలని కోరారు. ఉర్సాకు ఎకరా రూ.కోటి, రూ.50 లక్షలకు ఇచ్చేమనే వివరణ ఇవ్వడానికి ప్రభుత్వానికి ఇంత సమయం పట్టిందా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వి.కృష్ణయ్య, జిల్లా కార్యదర్శి జి.విజయకుమార్ పాల్గొన్నారు.

పాకిస్తాన్ పౌరులు దేశం విడిచి వెళ్లాల్సిందే..

● పల్నాడు ఎస్పీ కంచి శ్రీనివాసరావు

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పాకిస్తాన్ పౌరులు దేశం విడిచి తమ స్వదేశానికి వెళ్లిపోవాలని పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పాకిస్తానీయుల వీసాలను రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ఎవరైనా అక్రమంగా నివసిస్తుంటే వారిపై, వారికి ఆతిథ్యం ఇచ్చిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఏఎన్‌యూ పీజీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

పెదకాకాని, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో మంగళవారం నుంచి పీజీ నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, సప్లమెంటరీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్షల సమన్వయకర్త ఆచార్య ఎం.సుబ్బారావు పరిశీలకుల నియామకంతో పాటు తనిఖీ బృందాలను నియమించారు. వర్సిటీలోని పరీక్ష కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. సదుపాయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షల నిర్వహణకు గుంటూరు జిల్లాలో 14, ప్రకాశం జిల్లా పొదిలిలో ఒక పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశామమని తెలిపారు. విశ్వవిద్యాలయం పరిధిలో బుధవారం పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు జరుగుతుందని తెలిపారు.



వర్సిటీ పరీక్ష కేంద్రంలో తనిఖీ చేస్తున్న సమన్వయకర్త సుబ్బారావు

భర్తపై యాసిడ్‌తో దాడి

పెదకాకాని, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): భర్తపై భార్య యాసిడ్‌తో దాడి చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు మంగళవారం పెదకాకాని పోలీసులు తెలిపారు. వివరాలు.. విశాఖపట్నం సమీపంలోని గాజువాక చెందిన గండికోట బాలకృష్ణ అనే వ్యక్తికి గుంటూరుకు చెందిన రమణమ్మకి రెండు నెలల క్రితం వివాహం జరిగింది. రమణమ్మకు ఇది నాలుగో వివాహం. వీరిద్దరూ గుంటూరులో నివాసం ఉంటున్నారు. గుంటూరు సమీపంలోని కుర్నూతుల గ్రామంలో బాలకృష్ణ సోదరి ఇంటిలో శుభకార్యానికి వెళ్లవద్దని భార్య రమణమ్మ భర్తకు అడ్డుపడింది. దీంతో వీరిద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. ఈ నేపథ్యంలో గత రాత్రి తన స్నేహితుడిని కలిసేందుకు బాలకృష్ణ ద్విచక్ర వాహనంపై కాజ గ్రామానికి వెళ్తున్నాడు. భార్య రమణమ్మ మరో వ్యక్తి సహకారంతో కార్‌లో పెదకాకాని సమీపంలోని జాతీయ రహదారిపై పల్లాలమ్మ చెరువు వద్ద బాలకృష్ణను అడ్డగించింది. తనతో పాటు తెచ్చిన యాసిడ్‌ను అతనిపై పోసి అక్కడి నుంచి వెళ్లిపోయింది. స్థానికుల సహకారంతో 108 అంబులెన్స్‌లో బాధితుడిని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాలకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పెదకాకాని పోలీసులు తెలిపారు.

రోడ్డెక్కిన మిర్చి రైతులు

● బ్రోకర్ నుంచి డబ్బులు ఇప్పించాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న మిర్చి రైతులతో మాట్లాడుతున్న పోలీసులు

సత్తెనపల్లి ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మిర్చి కొనుగోలు చేసిన వ్యాపారి నుండి డబ్బులను ఇప్పించాలని మిర్చి రైతులు రోడ్డెక్కారు. పురుగు మందు డబ్బాలతో సత్తెనపల్లిలోని తాలూకా సెంటర్‌లో రోడ్డుపై బైఠాయించి, నిరసన వ్యక్తం చేశారు. ఫిరంగిపురం మండలం యర్రగుంటపాడు, సత్తెనపల్లి మండలం లక్కరాజు గార్లపాడు గ్రామాలకు చెందిన రైతుల నుంచి లక్కరాజు గార్లపాడుకు చెందిన రాయపూడి తిరుమలరావు సుమారు రూ.40 లక్షల విలువైన మిర్చిని కొనుగోలు చేశాడు. కొంతమంది రైతులకు అడ్వాన్స్‌గా కొంత మొత్తం చెల్లించాడు. మిగిలిన మొత్తాన్ని గుంటూరు మిర్చి యార్డులో మిర్చి అమ్మి చెల్లిస్తానని నమ్మబలికాడు. తిరుమలరావు గ్రామం విడిచి వెళ్లిపోయాడని, అతనిని పట్టుకుని రూరల్ పోలీసు స్టేషన్‌లో అప్పగించినా ఇప్పటి వరకు తమకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులను ఇప్పించాలని కొందరు రైతులు పురుగుమందు తాగేందుకు యత్నించారు. పోలీసులు వారిని అడ్డుకుని న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నాను విరమించారు. ధర్నా సందర్భంగా తాలూక సెంటర్‌లో ట్రాఫిక్ స్తంభించింది.

స్థల సమీకరణ పూర్తికాగానే లెదర్ పార్క్

● లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు

శావల్యాపురం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): వినుకొండ నియోజకవర్గంలో చర్మకారులు ఎక్కువగా ఉన్నందున లెదర్ పార్క్ ఏర్పాటు చేయనున్నామని రాష్ట్ర లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు తెలిపారు. అనుకూలంగా స్థలం దొరకగానే పనులు ప్రారంభిస్తామన్నారు. శావల్యాపురంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. విదేశీయులు వినుకొండలో లెదర్ పార్క్ ఏర్పాటు చేయడానికి ఇటీవల స్థలాన్ని పరిశీలించారని తెలిపారు. అడిగొప్పల వద్ద కూడా స్థల పరిశీలన చేయగా... అక్కడ జగనన్న కాలనీ ఏర్పాటు చేయడంతో.. మరోచోట స్థలాన్ని పరిశీలించామన్నారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు చొరవ తీసుకొని వినుకొండలో స్థలాన్ని కేటాయిస్తే చర్మకారులకు జీవనోపాధి కల్పించేలా లెదర్ పార్క్‌ను ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

వైద్య కళాశాలలో అభివృద్ధి పనులు ప్రారంభం

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గుంటూరు వైద్య కళాశాలలో నిర్మించిన ప్రవేశద్వారంతో పాటు అభివృద్ధి చేసిన అవుటర్ వాల్‌ను దాత న్యూరాలజిస్ట్ డాక్టర్ చెరుకూరి పవన్‌కుమార్ మంగళవారం శిలాఫలకం ఆవిష్కరించి, ప్రారంభించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారీ పిలుపు మేరకు ఆయన ఈ అభివృద్ధి పనులకు రూ.8 లక్షలు విరాళమిచ్చారు. వాల్‌కు పెయింటింగ్ వేసి, జీఎంసీ గోల్డెన్స్ లెటర్స్ ఏర్పాటు చేశారు. ప్రిన్సిపల్ డాక్టర్ సుందరాచారి, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ప్రభాకర్, వివిధ వైద్య విభాగాధిపతులు పాల్గొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో రోటరీ క్లబ్ సెంటినియల్ ఆధ్వర్యంలో రూ.75 వేలతో ఏర్పాటు చేసిన 'వీ ట్రస్ట్ జీజీహెచ్' అనే గ్లో సైన్‌బోర్డ్‌ను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ ప్రారంభించారు. రోటరీ క్లబ్ గుంటూరు అధ్యక్షుడు పొనకాల బాల సుబ్రహ్మణ్యం, కార్యదర్శి నవీన్ చక్రవర్తి, క్లబ్ డైరెక్టర్లు డాక్టర్ వీర రాఘవ, సంతోష్, కోట మురళీకృష్ణ పాల్గొన్నారు.



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న డాక్టర్ చెరుకూరి పవన్ కుమార్

హత్య కేసులో జీవిత ఖైదు, జరిమానా

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తిని దారుణంగా హతమార్చి, రూ.380లు నగదు దోపిడీ చేసినట్లు నేరం రుజువుకావడంతో.. పట్టణానికి చెందిన తన్నీరు అంకమ్మరావు అలియాస్ ముళ్లపందికి జీవిత ఖైదు, రూ.15 వేలు జరిమానా విధిస్తూ స్థానిక 13వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి నేతి సత్యశ్రీ మంగళవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. 2023 మే 9వ తేదీన రాత్రి పట్టణంలోని బ్రహ్మానంద రెడ్డి మున్సిపల్ కాంప్లెక్స్‌లో నిద్రిస్తున్న 55 ఏళ్లున్న గుర్తుతెలియని వ్యక్తిని నిందితుడు ఇటుక రాయితో మోది, దారుణంగా హత్యచేశాడు. అతని నుండి కొంత నగదు దొంగిలించాడు. మరుసటి రోజు 18వ వార్డు ఇన్‌చార్జి వీర్వో చల్లా చిరంజీవి ఈ ఘటనపై మొదటి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి సీఐ ఆకుల అశోక్ కుమార్ నిందితుడిని అరెస్టు చేసి, ప్రాథమిక దర్యాప్తు అనంతరం కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. నేరం రుజువుకావడంతో.. హత్య కేసులో జీవిత ఖైదు, జరిమానా, దోపిడీ కేసులో పదేళ్ల కఠిన కారాకార శిక్ష, రూ.5 కవేలు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. ప్రాసిక్యూషన్ ఏపీపీ దేశిరెడ్డి మల్లారెడ్డి నిర్వహించారు. నిందితుడు అంకమ్మరావు పలు హత్య కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

1,24,819 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 1,27,525 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,24,819 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 52,500 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9500	13200
నంబరు.5	10000	12500
273	10000	12400
341	10000	13200
4884	10000	11200
సూపర్10	10000	12400
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
తేజ	10000	13600
షార్క్-1	10000	12100
బ్యాడిగి 355	10000	13000
సింజెంటా బ్యాడిగి 5531	---	---
దేవనూరుడీలక్స్	10000	12600
ఆర్మూరు	9800	11200
తాలుకాయలు	4500	6500

నేడు అనుగరాజు విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ

పిడుగురాళ్ల, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): 11వ శతాబ్దంలో పల్నాడు రాజ్యాన్ని స్థాపించి పరిపాలించిన అనుగరాజు యాదవ్ విగ్రహం ఏర్పాటు భూమిపూజ కార్యక్రమం బుధవారం ఉదయం 10 గంటలకు జరుగనున్నదని విగ్రహ కమిటీ సభ్యులు తెలిపారు. గంగమ్మగుడి సమీపంలో జరిగే భూమి పూజ కార్యక్రమానికి గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి తదితరులు ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారని కమిటీ సభ్యులు తెలిపారు.

గ్రంథాలయంలో యోగాపై శిక్షణ

అమరావతి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి కాలాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు 40రోజుల పాటు జరిగే విజ్ఞాన శిబిరంలో మంగళవారం యోగా శిక్షణ ఇచ్చారు. స్థానిక యోగా గురువు గిరిస్వామి విద్యార్థులకు ధ్యానం, యోగాసనాలపై శిక్షణ ప్రారంభించారు. కార్యక్రమంలో విద్యార్థులతో పాటు గ్రంథాలయాధికారి ఎం వెంకాయమ్మ పాల్గొన్నారు.

ప్రధాన మంత్రి సభను విజయవంతం చేయాలి

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి అంజయ్య

కారంపూడి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో రాజధాని శంకుస్థాపకు మే 2వ తేదీన వస్తున్న ప్రధాని నరేంద్రమోదీకి ఘన స్వాగతం పలికి బహిరంగ సభను విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి శెట్టి హనుమంతురావు, జనసేన నియోజకవర్గ కన్వీనర్ రామాంజనేయులు మంగళవారం పిలుపునిచ్చారు. ఐదేళ్లుగా రాజధాని లేదని, కూటమి అధికారంలోకి రాగానే కేంద్ర ప్రభుత్వ సహకారంతో నిధులు సమకూర్చుకొని అభివృద్ధికి ముందడుగు వేయించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషికి అభినందనలు తెలిపేందుకు అందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు.

త్రీ వీలర్స్ ఆటో వర్కర్స్ నూతన కమిటీ

పిడుగురాళ్ల, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ది పల్నాడు త్రీ వీలర్స్ ఆటో వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ సమావేశం జరిగింది. పట్టణ టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు యరగాని వెంకట్ ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. కమిటీ గౌరవ అధ్యక్షుడిగా సతీష్, వడ్డవల్లి శివగంగాధర్, కమిటీ అధ్యక్షుడిగా డి.లాల్‌బాబు, ఉపాధ్యక్షుడిగా షేక్ యాసిన్, ప్రధాన కార్యదర్శిగా షేక్ నాగుల్ షరీఫ్, రఫీ, వీ చినసైదా, షేక్ హుస్సేన్, కరీముల్లాతో పాటు మరికొంత మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను పార్టీ పట్టణ కార్యాలయంలో పాండురంగ శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, ఏఎంసి చైర్మన్ తురకా వీరస్వామి, పిల్లి చెన్నారావు, సయ్యద్ అమీర్‌అలి, యడవల్లి కొండలు, తదితరులు అభినందించారు.

తహసీల్దార్ మేరీకి సన్మానం

రెంటచింతల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ మేరీ కనకాన్ని మంగళవారం ఆర్యవైశ్య సంఘ మండల నేతలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ తన పరిధిలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత నాళం పెదబాబు, ఏచూరి వెంకట సైదయ్య, గుండా రామ్మూర్తి, కొత్త గోపాలరావు, పొట్టిమూర్తి రాంబాబు, ఆకుల నరసింహారావు, ఏచూరి మునలయ్య, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

రోడ్డు మార్జిన్ గుంతల పూడ్చివేత

సత్తెనపల్లి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి పట్టణ పరిధి నుంచి రాజుపాలెం మండలం కొండమోడు వరకు రోడ్డు మార్జిన్‌లోని గుంతలను రోడ్డుపై ఉన్న గుంతలను రూరల్ సీఐ కిరణ్ రాజుపాలెం ఎస్ఐ వేణుగోపాల్ నేషనల్ హైవే ఏఈ ప్రకాశంలు మంగళవారం దగ్గరుండి పూడ్చివేయించారు. మే 2న ప్రధాన మంత్రి పర్యటన సందర్భంగా మాచర్ల దాచేపల్లి, పిడుగురాళ్ళ, రాజు పాలెం, ధూళిపాళ్ల, సత్తెనపల్లి మీదుగా వెలగపూడి రాజధాని వైపు వెళ్లే వాహనాల రద్దీ దృష్ట్యా ఈ రహదారిని బాగుచేయించినట్లు సీఐ కిరణ్ తెలిపారు.

వావిలాలకు ఘన నివాళి

సత్తెనపల్లి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు వావిలాల గోపాలకృష్ణయ్య 22వ వర్ధంతిని మంగళవారం వావిలాల పార్కులో టీడీపీ నేతలు ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

● రాజుపాలెం (ఆంధ్రజ్యోతి): రాజుపాలెంలో ఉన్న జనసేన పార్టీ మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన వావిలాల గోపాలకృష్ణయ్య చిత్రపటానికి ఆ పార్టీ మండల అధ్యక్షుడు తోట నరసయ్య, ఉపాధ్యక్షుడు బత్తుల హనుమంతురావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు నారపుశెట్టి కోటేశ్వరరావు, పగడాల నరసింహారావు, రుసుం వేంకటేశ్వర్లు తదితరులు పూలమాల వేసి నివాళి అర్పించారు.

రైల్వే ఉద్యోగి ఆత్మహత్య

సత్తెనపల్లి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వే క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న రైల్వే ఉద్యోగి షేక్ మస్తాన్(59) మంగళవారం తెల్లవారుజామున గొంతు, మణికట్టు దగ్గర కత్తితో కోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొంతకాలం నుంచి మస్తాన్ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడని ఈ నేపథ్యంలోనే ఆత్మహత్య చేసుకున్నాడని ఆయన భార్య, కుమారుడు పట్టణ పోలీసులకు తెలిపారు. ఆగస్టు 31న ఆయన ఉద్యోగం నుంచి విరమణ కాబోతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. మస్తాన్ ఆత్మహత్య చేసుకు న్నాడా.. లేక మరేదైనా జరిగిందా? అనే కోణంలో పట్టణ సీఐ నాగ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు విచారిస్తున్నారు. సంఘటనా స్థలానికి క్లూస్‌టీం చేరుకుని ఫింగర్ ప్రింట్‌లను సేకరించారు. మస్తాన్ కుమారుడి ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల పునర్వైభవానికి చేయూత



అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ, ఎమ్మెల్యేలు జూలకంటి, చదలవాడ, కలెక్టర్ అరుణ్‌బాబు

● పదో తరగతిలో టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులకు నగదు పురస్కారాలు

● లంచ్ విత్ కలెక్టర్ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే జూలకంటి వరాల జల్లు

మాచర్లటౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : నరసరావు పేట ప్రకాశ్‌నగర్‌లోని భవనచంద్రటౌన్ హాల్లో మంగళవారం పల్నాడు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యాన లంచ్ విత్ కలెక్టర్ కార్యక్రమాన్ని నరసరావుపేటలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రభుత్వ విద్యాలయాలకు పునర్వైభవం తీసుకొచ్చేందుకు ప్రముఖ పాత్ర పోషించారు. నియోజకవర్గ పరిధిలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులందరికీ కలిపి రూ.10లక్షల నగదు పురస్కారాలను ప్రకటించి ఆదర్శంగా నిలిచారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పరీక్షల్లో 85శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల ఉపాధ్యాయులకు ఒక్కొక్కరికి రూ.10 వేల నజరానా ప్రకటించారు. నియోజకవర్గ ప్రభుత్వ విద్యా కీర్తి పతాకాన్ని రాష్ట్రస్థాయిలో నిలబెట్టి 600 మార్కులకు 598, 596 మార్కులు సాధించిన విద్యార్థులు పావని, సమీరాలకు ఒక్కొక్కరికి రూ.లక్ష నగదు చెక్కులను వేదికపై ఎమ్మెల్యే జూలకంటి అందించారు. అలాగే 600లకు 593 మార్కులు సాధించిన అమూల్యతో కలిసి 580కు పైగా మార్కులు సాధించిన 13 మంది విద్యార్థులకు రూ.50 వేల నగదును ప్రకటించారు.

పాఠశాలల్లో ఆహ్లాదకర వాతావరణం ఉండాలి

ప్రభుత్వ పాఠశాలల్లో ఆహ్లాదకరమైన వాతావరణం ఉన్నప్పుడు విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని ఎమ్మెల్యే జూలకంటి అన్నారు. పరిసరాల శుభ్రత, విద్యార్థుల్లో క్రమశిక్షణ ఉన్నప్పుడే ప్రభుత్వ విద్యలో అద్భుతాలు సాధించవచ్చన్నారు. పాఠశాలలో విద్యార్థుల శాతం పెంచేందుకు ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషించాలన్నారు. పాఠశాలలను ఆదర్శంగా తీర్చిదిద్దినప్పుడే తల్లిదండ్రులు ప్రభుత్వ విద్య వైపు మొగ్గు చూపుతారని స్పష్టం చేశారు. ప్రభుత్వ విద్యలో మంత్రి నారా లోకేశ్ తీసుకొస్తున్న సంస్కరణలు దేశానికి ఆదర్శమని కొనియాడారు. కార్యక్రమంలో కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజా, ప్రభుత్వ విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యేలు అరవిందబాబు, డీఈవో ఎల్ చంద్రకళ, సర్వశిక్షా అభియాన్ ఏపీసీ సుబ్బారావు, ఎంఈవోలు పాల్గొన్నారు.

హామీని నెరవేర్చిన ఎమ్మెల్యే : టీడీపీ నేతలు

రెంటచింతల, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే బాల బాలికలకు పదో తరగతిలో అత్యధిక మార్కులతో పాటు 85 శాతం దాటిన ప్రతి పాఠశాల టీచర్‌కు రూ.10 వేలు ఇస్తానని మాట ఇచ్చిన మేరకు నిలబెట్టుకోవడమంటే విద్యారంగాన్ని ప్రోత్సహించడమేనని టీడీపీ మండల అధ్యక్షుడు అబ్బిరెడ్డి అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కిందటేడాది డిసెంబర్ 8న జెట్టిపాలెంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాటిచ్చారని ఆ మేరకు మాటకు కట్టుబడి సుమారు రూ.10 లక్షలు విద్యార్థులకు, చదువు చెప్పిన టీచర్లకు అందచేయడం శుభపరిణామమన్నారు. సమావేశంలో బీసీ నేత ఎన్ శ్రీనివాసరావు, మండలపరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు సుమంత్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాజ్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు రాజారెడ్డి, రాయపరెడ్డి, రామకృష్ణ, శౌరైడ్డి,తుమ్మా జోజిరెడ్డి తదితరులున్నారు.

టీడీపీ బీమా చెక్కుతో నాగేశ్వరరావు కుటుంబానికి అండ



నాగేశ్వరరావు కుటుంబానికి రూ.5 లక్షల బీమా చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ బీమా చెక్కుతో నాగేశ్వరరావు కుటుంబానికి అండ అని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. మండలంలోని కాశిపాడు గ్రామానికి చెందిన సంకు నాగేశ్వరరావు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. కాశిపాడులో మంగళవారం నాగేశ్వరరావు కుటుంబసభ్యులకు రూ.5 లక్షల టీడీపీ బీమా చెక్కును ఎమ్మెల్యే ప్రవీణ్ అందించారు. పార్టీ కష్టకాలంలో నాగేశ్వరరావు ఎన్నో సేవలు అందించారని ఆయన మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు, మంత్రి లోకేశ్‌కు, ఎమ్మెల్యే ప్రవీణ్‌కు నాగేశ్వరరావు కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

గాయపడిన నాయకుడికి పరామర్శ

క్రోసూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న దొడ్లేరు టీడీపీ నాయకుడు షేక్ కరీముల్లాను ఎమ్మెల్యే ప్రవీణ్ మంగళవారం పరామర్శించారు. బాధితల గృహానికి వెళ్లి ప్రమాదం జరిగిన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

శిరిగిరిపాడులో ఉద్రిక్తత.. ఎస్సీ కాలనీలో రాళ్ల దాడి



పికెటింగ్ నిర్వహిస్తున్న పోలీసులు

వెల్దుర్తి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శిరిగిరిపాడు ఎస్సీ కాలనీలో మంగళవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఎస్సీ సామాజికవర్గానికి చెందిన టీడీపీ, వైసీపీ వర్గీయులు రాళ్లదాడి చేసుకోవడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. గ్రామానికి చెందిన వైసీపీ నేత కొమ్ము బొంగురు, టీడీపీ సానుభూతిపరుడు ఆరుమళ్ల విజయ్ మాచర్ల పట్టణంలో నివాసముంటున్నారు. ఓ స్థలం విషయంలో మాచర్ల పట్టణంలో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దిగారు. ఈ క్రమంలో సొంతూరు అయిన శిరిగిరిపాడులో తమ బంధువులకు సమాచారం అందించారు. సోమవారం సాయంత్రం ఇరువర్గీయుల మధ్య కొద్దిపాటి ఘర్షణ జరగడంతో పెద్దలు సర్దిచెప్పడంతో వెనుదిరిగారు. మంగళవారం ఉదయం టీడీపీకి చెందిన విజయ్‌పై వైసీపీకి చెందిన బొంగురు బంధువులు, మరికొందరు కలిసి శిరిగిరిపాడులో దాడి చేశారు. ఈ ఘర్షణతో ఇరువర్గీయులు గుంపులుగా చేరి ఒకరిపై ఒకరు రాళ్లదాడికి దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గీయులను చెదరగొట్టారు. కాగా దాడిలో ఎవరికీ గాయాలు కాలేదు. కాగా దీనిపై ఎటువంటి కేసు నమోదు కాలేదు. పోలీసులు అప్రమత్తమై శిరిగిరిపాడుకు చేరుకొని ఘర్షణలు అదుపు చేయకపోతే రాళ్లదాడితోపాటు పెద్ద నష్టం జరిగి ఉండేది. మాచర్ల రూరల్ సీఐ నఫీజ్ బాషా, వెల్దుర్తి ఎస్ఐ సమందర్ వలి, స్పెషల్ పార్టీ పోలీసులు గ్రామంలో పర్యటించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు.

ఏపీఎస్ ఆర్టీసీలో సమస్యలను పరిష్కరించాలి



ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఎన్ఎంయూ నేతల రిలే దీక్షలు

సత్తెనపల్లి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఉద్యోగ భద్రత సర్క్యులర్‌ను తక్షణమే అమలు చేయాలని కోరుతూ ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ సత్తెనపల్లి డిపో ఆధ్వర్యంలో మంగళవారం బస్టాండ్ వద్ద పలు అంశాలపై కార్మికులు రిలే దీక్షలు చేశారు. అక్రమ సస్పెన్షన్‌లు, అక్రమ రిమూవల్స్‌ను వెంటనే ఆపాలన్నారు. నాలుగు సంవత్సరాలుగా ఆగిపోయిన ప్రమోషన్స్‌ను వెంటనే ఇవ్వాలని గ్యారేజి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులు వెంటనే మంజూరు చేయాలన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థాపరంగా జీతాలు ఇవ్వాలన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

● నాగేశ్వరరావు, డిపో కార్యదర్శి


ఆర్టీసీలో వివిధ కేటగిరిలలో పనిచేస్తున్న సిబ్బంది ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించాలి. ఉద్యోగులకు అనారోగ్య సెలవులకు పూర్తి జీతం చెల్లించాలి డిప్యుటేషన్‌లను యథావిధిగా కొనసాగించాలి

డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి

● దుర్గారావు, డిపో అధ్యక్షుడు

ఆన్ కాల్ డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి. ఆఫీసు సిబ్బంది దీర్ఘకాలిక సమస్యలను, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి. ఉద్యోగ భద్రత సర్క్యులర్‌ను వెంటనే అమలు చేయాలి.

ప్రకృతి వైపరీత్యాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన



కాలిపోతున్న గుడెసె మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

దాచేపల్లి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం రామాపురం గ్రామంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారుల ఆధ్వర్యాన తుఫాను, వరదలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై అవగాహన కల్పిస్తూ ఫిజికల్ మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహించారు. మంగళవారం రామాపురం గ్రామంలో అగ్నిమాపక శాఖ, ప్రభుత్వ వైద్యులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. అగ్ని ప్రమాదాలు సంబవించినప్పుడు బిల్డింగ్‌లో ప్రమాదవశాత్తూ ఉన్న వ్యక్తులను కిందకు దించే విధానం, తీవ్రంగా గాయపడిన వ్యక్తులకు తక్షణమే వైద్య సేవలందించడం, నదులు, వాగులు ఉప్పొంగినప్పుడు నీటిలో ఉన్న వారిని క్షేమంగా బయటకు తీసే విధానంపై సోదాహరణంగా సిబ్బంది చూపించారు. కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీధర్, దాచేపల్లి తహసీల్దార్ వైవీ కుటుంబరావు, వైద్యులు జోయల్ ప్రసాద్, నరసింహారెడ్డి, సీడీపీవో అరుణ, ఈవోపీఆర్డీ సీఎల్ఎన్ గుప్త, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ వేముల వినోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాటు సారా నిర్మూలనకు కృషి చేయాలి : జిల్లా ఎక్సైజ్ అధికారి

మాచర్లరూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నాటుసారా నిర్మూళనకు అందరు కలిసికట్టుగా కృషి చేయాలని జిల్లా ఎక్సైజ్ అధికారి మణికంఠ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో నవోదయం-2 కార్యక్రమంలో భాగంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. సారా నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. పట్టణంలోని బెల్లం వ్యాపారులతో సమావేశమై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు అభివృద్ధిలో లావు పాత్ర కీలకం

నకరికల్లు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా అభివృద్ధిలో నరసరావుపేట పార్లమెంటు సభ్యుడు లావు శ్రీకృష్ణ దేవరాయలు కీలక భూమి పోషిస్తున్నారని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగోతు శౌరయ్య అన్నారు. మంగళవారం నకరికల్లు టీడీపీ కార్యాలయంలో ఎంపీ లావు పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో తిరుమలశెట్టి వెంకట్రావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీ, యార్డు చైర్మన్ పుట్టినరోజు

సత్తెనపల్లి రూరల్, సత్తెనపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, సత్తెనపల్లి మార్కెట్ యార్డు చైర్మన్ కోమటినేని శోభారాణి శ్రీనివాసరావుల పుట్టినరోజు వేడుకలు స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో, టీడీపీ ప్రజావేదికలో మంగళవారం ఘనంగా నిర్వహించారు.

శ్రీకృష్ణదేవరాయలు, గౌతమ్‌రెడ్డి జన్మదిన వేడుకలు

దుర్గి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): దుర్గి బస్టాండ్ సెంటర్లో మంగళవారం నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కుమారుడు, టీడీపీ యువనేత జూలకంటి గౌతమ్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. గౌతమ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

పిడుగురాళ్ల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పుట్టినరోజును పురస్కరించుకొని పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు వున్నం నాగమల్లికార్జునరావు వృద్ధాశ్రమంలోని వృద్ధులకు, అనాథలకు భోజనం అందజేశారు.

ఆదర్శంగా జీవించడమే క్రైస్తవ జీవితం



తాడువాయిలోని నూతన చర్చిని జలములతో ఆశీర్వదిస్తున్న గుంటూరు జిల్లా బిషప్ చిన్నాబత్తిన భాగ్యయ్య

అచ్చంపేట, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఇతరులకు ఆదర్శంగా జీవించడమే క్రైస్తవ జీవితం అని ఉమ్మడి గుంటూరు జిల్లా బిషప్ చిన్నాబత్తిన భాగ్యయ్య అన్నారు. మంగళవారం తాడువాయిలోని తిరుకుటుంబ దేవాలయాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా జరిగిన దివ్యబలిపూజలో బిషప్ చిన్నాబత్తిన భాగ్యయ్య క్రైస్తవులకు ప్రత్యేక సందేశాన్ని అందించారు. నూతన దేవాలయాన్ని రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. బిషప్‌కు క్రైస్తవులు ఘన స్వాగతం పలికారు. తాళ్ళచెరువు విచారణ గురువు ఫాదర్ పుట్టి అంథోని రాజు, మందా అంథోనిరాజు, కోట అంతోనిరాజు, పోపూరి ప్రకాష్ అనేక మంది గురువులు కన్యాస్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

చర్చి అభివృద్ధికి అండగా ఉంటా : మాజీ ఎమ్మెల్యే

తాడువాయిలో మంగళవారం తిరుకుటుంబ దేవాలయ నూతన ప్రతిష్ఠా కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నంబూరి శంకరరావు పాల్గొన్నారు. గతంలో ఇచ్చిన విరాళాలే కాకుండా చర్చి అభివృద్ధి సహకారంగా ఉంటానన్నారు.

పది విద్యార్థులకు కలెక్టర్ సత్కారం



పది ఫలితాల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు జ్ఞాపిక అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు

క్రోసూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): క్రోసూరు మండలంలో ప్రభుత్వ పాఠశాలలో చదివి పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మంగళవారం కలెక్టర్ అరుణ్‌బాబు సత్కరించారు. విద్యార్థులతో పాటు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను కూడా సన్మానించారు. మండలంలో జడ్పీ హెచ్ఎస్‌లో చదవి మొదటి మూడు స్థానాల్లో నిలిచిన షేక్ షాహీద్ (587), పీ గాయత్రి(586), షేక్ ఆస్మా(584)లతోపాటు 550 మార్కులు పైగా సాధించిన 30 మంది విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు సాంబశివరావు, లక్ష్మీనారాయణ, ఈఎల్ లక్ష్మీనారాయణలకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు : ఎంపీడీవో

నకరికల్లు,ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా మండలంలో నీటి ఎద్దడి లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో రోశయ్య అన్నారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో మంగళవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.6 లక్షల విలువైన బోరింగ్ సామగ్రి అందుబాటులో ఉందన్నారు. బోరు పనిచేయకపోతే వెంటనే సమాచారం అందిస్తే బోర్లు బాగు చేయిస్తామన్నారు. కొందరు రేషన్ డీలర్లు బియ్యం ఇవ్వకుండా డబ్బులు తీసుకోవాలని బెదిరిస్తున్నారని షేక్ హుస్సేన్ ఆరోపించారు. సాధారణ సర్వసభ్య సమావేశానికి అధికారులు పదేపదే రాకపోవడంపై ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. సమావేశానికి హాజరుకాని సభ్యులపై చర్యలకు ఉన్నతాధికారులకు సిఫార్స్ చేస్తానని ఎంపీడీవో తెలిపారు.

మోదీ దక్షతకు ఏపీ టూరే నిదర్శనం

● అమరావతి పునర్నిర్మాణానికి తరలిరావాలి

● పదవులను బాధ్యతగా నిర్వర్తించాలి

● విస్తృతస్థాయి సమావేశంలో ఎమ్మెల్యే జూలకంటి, మర్రెడ్డి, మద్దిరాల

మాచర్లటౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాజధాని అమరావతి పునర్నిర్మాణానికి మే 2వ తేదీన దేశ ప్రధాని నరేంద్రమోదీ వస్తున్న సందర్భంగా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, మద్దిరాల మ్యానీ కోరారు. మంగళవారం పట్టణంలోని నెహ్రూనగర్ టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన టీడీపీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. మూడు ముక్కలతో ఆంధ్ర రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన జగన్‌రెడ్డికి బుద్ధి చెప్పి కూటమికి అధికారాన్ని ఇచ్చారని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా అమరావతి రాజధాని నిర్మాణం జరగబోతుందని వివరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపు మేరకు రాజధాని పునర్నిర్మాణ క్రతువకు నియోజకవర్గ నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావాలని కోరారు. పార్టీ నేతలు, కార్యకర్తలు సమన్వయం చేసుకొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. సరిహద్దుల్లో యుద్ధమేఘాలు కమ్ముకుని విపత్కర పరిస్థితులు ఉన్నా రాజధాని అమరావతి పునర్నిర్మాణ శంకుస్థాపనకు హాజరు కావడం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపై ప్రధాని మోదీ కున్న దక్షతకు నిదర్శనం అన్నారు.

పదవులను బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

టీడీపీలో పదవులు తీసుకున్న వారంతా బాధ్యతగా వ్యవహరించి కుటుంబ సాధికార సారథులు (కేఎస్ఎస్) నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి కేడర్‌కు దిశా నిర్దేశం చేశారు. పార్టీలోను, ప్రభుత్వంలోను నామినేటెడ్ పదవులు రావాలన్నా, ప్రజాప్రతినిధిగా సేవలందించాలన్నా ప్రతి ఒక్కరూ వార్డుల్లో కేఎస్ఎస్ నమోదు ప్రకియలో నిర్లక్ష్యం వహించకూడదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ శిక్షణతో మహిళలకు ఉపాధి

కారంపూడి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మహిళలకు స్వయం ఉపాధి పెంపొందించేందుకు కుట్టుమిషన్ శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. స్థానిక సచివాలయం- 2లో మంగళవారం ఏర్పాటు చేసిన కుట్టుమిషన్ శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు. మహిళలను అన్ని రంగాల్లో ముందుంచేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

రాజధానిలో పెదకూరపాడు నియోజకవర్గం కూడా భాగమే

● ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిలో పెదకూరపాడు నియోజకవర్గం కూడా ఒక భాగమేనని ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్ అన్నారు. గుంటూరులోని నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం రాష్ట్ర మంత్రి, పలు నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. రాజధాని అభివృద్ధికి అడుగులు పడుతున్న వేళ ప్రతి ఒక్కరు బాధ్యతగా కలిసి రావాలని, మే 2న అమరావతి పనులను పునఃప్రారంభించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొనే సభను విజయవంతం చేసే విషయంపై సమావేశంలో చర్చించారు. భవిష్యత్తు తరాల కోసం రాజధాని అభివృద్ధికి ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఎంతో అవసరమని చరిత్రలో నిలిచిపోయే అద్భుతమైన కార్యక్రమానికి నియోజకవర్గ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ ఆత్మీయ సమావేశంలో రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి, అమర్నాథ్ రెడ్డి, ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొని పలు విషయాలపై చర్చించారు.

వాటర్ గ్రిడ్ పథకం ద్వారా రూ.4కోట్ల 5లక్షల మంజూరు

రెంటచింతల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ రెంటచింతలలో నివసిస్తున్న ప్రతి ఇంటికి కృష్ణాజలాలను అందించే నిమిత్తం వాటర్ గ్రిడ్ పథకం ద్వారా రూ.4 కోట్ల 5 లక్షలు విడుదలైనట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెన్ను వెంకటేష్ చెప్పారు. నూతన ఓవర్ హెడ్ ట్యాంక్‌ను నిర్మించే నిమిత్తం మంగళవారం ఆనందపేట, గ్రామ పంచాయతీ ఎదురుగా ఉన్న స్థలాలను టీడీపీ నేతలు, ఎన్‌సీసీ ఇంజనీరింగ్ బృందంతో కలిసి పరిశీలించారు. ఆనందపేటలో లక్ష లీటర్ల ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి రూ.40 లక్షలు,3 లక్షల 30 వేలు లీటర్ల నీటిని నిల్వ ఉంచే పాత ట్యాంక్ స్థానంలో నూతన ట్యాంకు నిర్మాణానికి రూ.కోటి 50 లక్షలు, 4750 గృహాలకు వాటర్ కనెక్షన్లకు మిగతా నిధులను వెచ్చించాల్సి ఉందన్నారు. ఎన్‌సీసీ (నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ) వారు పనులు చేపడతారన్నారు. ప్రజల దాహార్తిని తీర్చడానికి కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు గొంటు సుమంత్‌రెడ్డి, సెక్రటరీ జి.కోటేశ్వరరావు, బి.రామకృష్ణ, శౌరైడ్డి, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఆరుపళ్ల విభాగంలో ప్రకాశం జిల్లా ఎడ్లకు ప్రథమస్థానం



దాచేపల్లిలో ఎడ్ల బలప్రదర్శన పోటీలో పాల్గొన్న ఆరుపళ్ల ఎడ్లజత

దాచేపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లిలోని వీర్లంకమ్మ దేవాలయంలో అమ్మవారి 25వ వార్షిక తిరునాళ్లలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఎడ్లపోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. సోమవారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో జరిగిన ఆరుపళ్ల విభాగంలో ప్రకాశం జిల్లా బేస్తవారిపేట మండలం కాజీపురంనకు చెందిన వేగనాటి ఓసూరరెడ్డి ఎడ్లజత 5వేల అడుగులతో ప్రథమస్థానంలో నిలిచింది. బాపట్ల జిల్లా పంగులూరుకు చెందిన గొట్టిపాటి రవికుమార్ యూత్ చిలుకూరి నాగేశ్వరరావు ఎడ్లజత 4952.8 అడుగులతో రెండోస్థానం, ప్రకాశం జిల్లా అర్ధవీడుకు చెందిన సూరచైత్రరెడ్డి పూజితరెడ్డి ఎడ్లజత 4856.7 అడుగులతో మూడోస్థానం, పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం కేసానుపల్లికి చెందిన నెల్లూరి రామకోటయ్య ఎడ్లజత 4750 అడుగులతో నాలుగోస్థానం, నకరికల్లు మండలం చల్లగుండ్లకు చెందిన మేక అంజిరెడ్డి ఎడ్లజత 4358.11 అడుగులతో ఐదోస్థానం, గురజాల మండలం అంబాపురంనకు చెందిన చుండు అయ్యప్పచౌదరి ఎడ్లజత 4 వేల అడుగులతో ఆరోస్థానం, బాపట్ల జిల్లా కొల్లూరు మండలం అనంతవరంకు చెందిన ఏలూరి సాంబశివరావు యూత్ పరుచూరి ఎమ్మెల్యే పీవీఆర్ బుల్స్ పెదవల్లి బ్రదర్స్ ఎడ్లజత 3108 అడుగులతో ఏడోస్థానం సాధించాయి. విజేతలకు నగదు బహుమతితోపాటు షీల్డ్‌లను అందించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



చింతామణి నాటకంలో సన్నివేశం

క్రోసూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): లయబ్రహ్మ ప్రముఖ సంగీత విద్వాంసుడు షేక్ ఖుదావన్ వర్ధంతి సందర్భంగా క్రోసూరులో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను విశేషంగా అలరించాయి. ముఖ్యంగా తల్లిదండ్రులకు, పిల్లలకు మధ్య సంబంధాలను తెలియజేస్తూ సందేశాత్మ కంగా ప్రదర్శిం చిన కళాపరిషత్ నాటకం 'నాన్నా నేను వచ్చేస్తా' తన్మయులను చేసింది. అనంతరం రాష్ట్రంలోని ప్రముఖ కళాకారులు ప్రదర్శించిన చింతామణి నాటకం విశేషంగా అలరించింది. గంటసాల మధుర గేయాలాపానలు, జానపదగేయాలు, హరికథ కాలక్షేపాలు విశేషంగా ఆకర్షించాయి. ముందు ఖదావన్ చిత్రపటాన్ని గ్రామంలో ఘనంగా ఊరేగించారు. కార్యక్రమాలను స్థానిక రంగస్థల కళాకారుల కమిటితో పాటు ఉమ్మడి రాష్ట్ర చలనచిత్ర నాటక రంగ అభివృద్ధి సంస్థ మాజీ డైరెక్టర్ బొబ్బెళ్ళ పాటి గోపాలకృష్ణసాయి పర్యవేక్షించారు.

నీటి కుంటలతో.. జల సిరులు

- పెరగనున్న భూగర్భ జలాలు
- రైతులకు సాగు, మూగ జీవాలకు తాగునీరు


నీటి కుంటలకు కొలతలు తీస్తున్న అధికారులు

బొల్లాపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నీటి కుంటలతో జల సిరులు పెరగనున్నాయి. భూగర్భ జలాల పెంపే లక్ష్యంగా ఉపాధి హామీ పథ కం అనుసంధానంతో గత టీడీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వహిం చింది. నీటి కుంటలతో సాగుతో పాటు గేదెలు, ఆవులు, ఎడ్లు తదితర మూగ జీవాలకు తాగు నీరు అందుబాటులో ఉంటుంది. అలాగే రైతులకు అదనపు ఆదాయం సమకూరేలా నమూనాలను అభివృద్ధి చేశారు. ఐదు ఎకరాల్లోపు వారికి అందుబాటులో ఉన్న స్థలాన్ని బట్టి నీటి కుంటల తవ్వకానికి అధికారులు నాలుగు నమూనాలను ఎంపిక చేశారు. ఉపాధి కూలీలకు ఈ నాలుగు నమూనాలను వరుసగా 120, 200, 420, 600 రోజుల పని దినాల పూర్తికి అవకాశం కల్పించారు. క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కల్పించి స్వచ్ఛందంగా నీటి కుంటల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది రాష్ట్ర ప్రభుత్వం

నీటి కుంటల నిర్మాణం ఇలా..

ఐదు మీటర్ల చొప్పున వెడల్పు, పొడవు, రెండు మీటర్ల లోతు పంట కుంటల తవ్వకం కోసం రూ.60వేలు, పది మీటర్ల చొప్పున వెడల్పు, పొడవు, రెండు మీటర్ల లోతు పంట కుంటల తవ్వకం కోసం రూ 1.15 లక్షలు, 15 మీటర్ల చొప్పున వెడల్పు, పొడవు, రెండు మీటర్ల లోతు పంట కుంటల తవ్వకం కోసం రూ.1.50 లక్షలు, 20 మీటర్ల చొప్పున వెడల్పు, పొడవు, రెండు మీటర్ల లోతు పంట కుంటల తవ్వకం కోసం రూ.2 లక్షలను కేటాయించారు. నమూనాలను కూడా రైతులు ఎంపిక చేసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. అంచల విధానంలో నిర్మించే కుంట గట్టు వెంబడి.. చుట్టూ పండ్ల మొక్కల పెంపకం, కాయ గూరలు, ఆకుకూరల సాగు, నీటిలో చేపల పెంపకం తదితర మార్గాల్లో అదనపు ఆదాయం పొంద వచ్చని ప్రోత్సహిస్తున్నారు. పంట కుంట నిర్వహణపై రైతులకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

వర్షా కాలం నాటికి పూర్తి చేసేలా ప్రణాళిక

బొల్లాపల్లి మండల పరిధిలో 33 పంచాయతీల్లో 460 పంట కుంటల నిర్మాణమే లక్ష్యంగా నిర్దేశించు కున్నామని ఏపీవో లక్ష్మణ్ తెలిపారు. వర్షా కాలం(జూన్) నాటికి పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ఇప్పటికే మండల పరిధిలో ఏడు నీటి కుంటలు పూర్తయ్యాయని చెప్పారు.

పసుపు ధర పతనం!

- మార్కెట్‌లో క్వింటా రూ.11 వేలు
- యార్డు విక్రయాలకు రైతులు విముఖత
- పెరిగిన పెట్టుబడులు, కౌలు అదనం
- ధర కోసం నిల్వ కేంద్రాల్లోనే పసుపు


దుగ్గిరాల యార్డులో రాశులుగా పోసిన పసుపు

దుగ్గిరాల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నానాటికీ తగ్గుతున్న ధరలతో పసుపు రైతుల్లో ఆందోళన నెలకొంది. ధరలు అంతంతమాత్రంగా ఉండటంతో రైతులు పసుపు విక్రయాలకు సుము ఖత వ్యక్తం చేయడం లేదు. కొత్త పసుపు యార్డుకు వచ్చే నాటికి ధరలు పెరుగుతాయన్న ఆశతో ఎదురు చూసిన అన్నదాతకు నిరాశే మిగిలింది. ప్రస్తుతం మార్కె ట్‌లో పసుపు ధర క్వింటాకు సగటున రూ.11 వేల వరకూ పలుకుతోంది. వరుసగా రెండేళ్లపాటు పూర్తిస్థాయిలో నష్టాన్ని చవిచూడటంతో పసుపు సాగు విస్తీర్ణం గణనీయంగా పడిపో యింది. సెంట్రల్ వేర్ హౌస్‌లు, కోల్డ్ స్టోరేజీల్లో నిల్వపెట్టిన పసుపును విక్రయిస్తే పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. అంతేకాకుండా నిల్వపెట్టిన పసుపునకు అద్దె కూడా చెల్లించలేని పరిస్థితిలో.. ధర కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. ఏడాది క్రితం క్వింటా రూ.14వేల వరకూ పలికిన పసుపు ధర క్రమేపీ తగ్గుతూ ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి రూ.11వేలకు చేరుకుంది. ఏప్రిల్ సీజన్ ప్రారంభ మయ్యే నాటికి ధరలు పెరుగుతాయన్న ఆశతో ఉన్న రైతులు.. నెల రోజులు గడుస్తున్నా ధర పెరుగుదల లేకపోవడంతో పసుపు విక్రయాలకు సుముఖత వ్యక్తం చేయడం లేదు.


పసుపు బస్తాల వద్ద దిగాలుగా ఉన్న రైతులు

యార్డులో తగ్గిన పసుపు విక్రయాలు

గతంలో సీజన్ ప్రారంభమవుతుందనగానే నిత్యం 1000 బస్తాల వరకూ పసుపు విక్రయాలు జరిగేవి. కనీసం మూడు నెలలపాటు ముమ్మరంగా విక్రయాలు కొనసాగేవి. నాలు గేళ్లుగా 3 వేల బస్తాలు దాటి జరిగిన పసుపు విక్రయ రోజులు 20 కూడా లేవంటే అతిశయోక్తి కాదు. యార్డులో లభించే కూలిపై ఆధారపడి జీవించే హమాలీలు సైతం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పెరుగుతున్న పెట్టుబడి, కౌలు ధరలు

పసుపు ధరల్లో పెరుగుదల లేకపోగా ఏటా పంట పెట్టుబడి అధికమవుతూ వస్తోంది. గతంలో ఎకరాకు రూ.లక్షకు మించి ఖర్చయ్యేది కాదని, ప్రస్తుతం రూ. 1.75లక్షల వర కూ పెట్టుబడి అవుతోందని, కౌలు రూ.50వేల వరకూ చెల్లిస్తున్నామని రైతులు చెబుతున్నారు. దిగు బడులు అంతం త మాత్రంగా ఉండడంతో క్వింటాకు కనీసం రూ.13వేల ధర పలికితేనే పెట్టుబడి చేతికి వచ్చే పరిస్థితి ఉందని వాపోతున్నారు.

ప్రతిపాదనలు సరే.. పైసలేవి?

ఉమ్మడి జిల్లాలో అధ్వానంగా పంట కాల్వలు

- 746 పనులకు.. రూ.25 కోట్లు అవసరమని ప్రతిపాదన
- నీటి తీరువా రూ.4 కోట్లు.. మిగిలిన నిధుల కోసం ఎదురుచూపు


వడ్డిముక్కల వద్ద పంట కాల్వలో పెరిగిన గుర్రపుడెక్క


శిథిలావస్థకు చేరుకున్న అలవల చానల్ షెట్టర్లు

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో పంట కాల్వలు అధ్వానంగా ఉన్నాయి. కాల్వల దుస్థితి రైతులకు ఏటా సాగు నీటి కష్టాలను మిగిలిస్తోంది. ప్రధాన పంట కాల్వల ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్(ఓఅండ్ఎం) పనులు గతంలో వేసవిలో చేపట్టి ఖరీఫ్ నాటికి ప్రవాహాలకు అడ్డంకులు లేకుండా చేసేవారు. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో రైతుల సాగు నీటి వెతలు గుర్తించలేదు. వరుణుడి కరుణపైన రైతులు ఆధారపడి పంటలు సాగు చేశారు. కాల్వల నిండా నీటి ప్రవాహానికి అడ్డంగా గుర్రపుడెక్క, పిచ్చి మొక్కలు, సిల్ట్‌తో పూడిక పేరుకుని ఆనావాళ్లు లేకుండా పోయాయి. కాల్వల్లో పిచ్చి చెట్లు, గుర్రపుడెక్క జంగిల్ క్లియరెన్స్ చేస్తున్నామని చెప్పిన గత పాలకులు పనులు చేపట్టకుండానే నిధులు కైంకర్యం చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో మరమ్మతులపై కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 746 పనులను గుర్తించి రూ.25.05 కోట్లు మంజూరు చేయాలని అధికారులు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపారు. 144 సాగునీటి సంఘాలు, 22 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ఒక ప్రాజెక్టు కమిటీ పర్యవేక్షణలో ఆయా పనులు నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. కాల్వల మరమ్మతులకు రూ.25 కోట్లు అవసరం కాగా నీటి తీరువా కేవలం రూ.4 కోట్లే ఉంది. దీంతో సాగు నీటి శాఖ అధికారులు ప్రభుత్వం నుంచి నిధుల కోసం ఎదురుచూస్తున్నారు. అయితే ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాలేదు. తాగునీటి అవసరాల కోసం మే 5 వరకు కాల్వలకు నీటిని విడుదల చేస్తున్నారు. మరో వైపు ముందస్తు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనాలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో జూన్, జూలై నెలల్లోగా ఓఅండ్ఎం పనులు చేయాల్సి ఉంది. కొద్ది రోజుల మాత్రమే సమయం ఉన్నందున త్వరగా నిధులు సమకూర్చుకుని కాల్వల మరమ్మతులు చేస్తే ఖరీఫ్ నాటికి కాల్వలు సిద్ధమవుతాయి. లేదంటే ఈ ఏడాది కూడా సాగు నీటి కష్టాలు తప్పవని రైతులు ఆందోళన చెందు తున్నారు.

హై సెక్యూరిటీ జోన్‌లోకి రాజధాని

- ప్రధాని మోదీ పర్యటనకు అసాధారణ భద్రత ఏర్పాట్లు
- కేంద్ర బలగాల ఆధీనంలోకి పర్యటన ప్రాంతం
- ఇప్పటికే విధుల్లో చేరిన ఐదువేల మందికిపైగా పోలీసులు
- డ్రోన్‌లు.. సీసీ కెమెరాల ద్వారా నిఘా
- చీమ చిటుక్కుమన్నా విరుచుకుపడేలా సాయుధ బలగాలు
- పోలీసులంతా అక్కడే.. అందరి చూపు, రూటూ అటే
- నేడు ప్రధాని పర్యటన ప్రాంతంలో ట్రయల్ రన్

గుంటూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : కశ్మీర్‌లో ఉగ్రదాడి.. సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు.. దాయాది దేశం కవ్వింపు చర్యలు. వంటి పరిణామాల నేపథ్యంలో మరి కొద్ది గంటల వ్యవధిలో దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఏపీ రాజధాని ప్రాంతంలో పర్యటనకు వస్తుండటంతో పోలీస్ శాఖ పూర్తిగా అప్రమత్తమైంది. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో పోలీస్ శాఖ ప్రధాని పర్యటనకు అసాధారణ భద్రత ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా పోలీసులందరి చూపు రాజధాని ప్రాంతంపైనే ఉంది. పోలీసులందరి దారి రాజధాని వైపే అన్నట్లుగా పోలీసులందరూ రాజధాని ప్రాంతానికి చేరుకున్నారు. ప్రధాని పర్యటనకు మరి కొద్ది గంటలే వ్యవధి ఉండడంతో కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలన్నీ రాజధాని ప్రాంతంలో మోహరించాయి. ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా పోలీస్ శాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తోంది. మంగళవారం నాటికే దాదాపు 5వేల మందికి పైగా పోలీసులు రాజధాని ప్రాంతానికి చేరుకున్నారు. నేడు మరో వెయ్యి మంది బలగాలు రానున్నాయి. బుధవారం మధ్యాహ్నం ప్రధాని పర్యటించే ప్రాంతంలో ట్రయల్ రన్ నిర్వహించనున్నారు. ట్రయల్ రన్ ప్రారంభంతోనే ప్రధాని పర్యటన ప్రాంతం పోలీసుల అధీనంలోకి వెళ్లనుంది. ప్రధాని పర్యటించే వీఐపీ మార్గంలోనూ... అదే విధంగా బహిరంగ సభ జరిగే పరిసరాల్లోనూ అడుగడుగునా పోలీసులు బందోబస్తు నియమించారు. ప్రధాని పర్యటన ముగించుకుని వెళ్లే వరకు బం దోబస్తు విధుల్లో ఉన్న పోలీసు పూర్తి అప్రమత్తంగా ఉండాలంటూ ఉన్నతాధికారులు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

పోలీస్ ఉన్నతాధికారులంతా అక్కడే మకాం

గుంటూరు, కృష్ణా జిల్లాల పోలీసు ఉన్నతాధికారులంతా ప్రధాని పర్యటన బందోబస్తు విధుల్లో తలమునకలయ్యారు. వారంతా రాజధాని ప్రాంతంలోనే మకాం వేసి భద్రత ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. సైరన్ మోతలు... కవాతు శబ్దాలతో రాజధాని ప్రాంతంలో ఎటు చూసినా పోలీసుల హడావుడే కనిపిస్తోంది. మ రోవైపు పోలీస్ ఉన్నతాధికారుల రాకపోకలు.. మంత్రులు, ఎమ్మెల్యే ల పర్యటనలతో ఆ ప్రాంతంలో సందడి వాతావరణం నెలకొంది.

రాజధాని ప్రాంతానికి చేరుకున్న ఎస్పీజీ కమాండోలు

ప్రధాని భద్రత నేపథ్యంలో స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్పీజీ) కమాండోలు మంగళవారమే రాజధాని ప్రాంతానికి చేరుకొన్నాయి. ఆయా భద్రత ఏర్పాట్లను పరిశీలించి, సంబంధిత పోలీసు అధికా రులకు తగు సలహాలు, సూచనలు ఇస్తున్నారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై కన్నేసాయి. అసాం ఘిక శక్తులకు ఏ మా త్రం ఆస్కారం ఇవ్వకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. గతంలో ఎన్నడూ చూడని విధంగా పోలీ సుల బందోబస్తు ఏర్పాటు చేయడంతో ఆ ప్రాం తం మంతా పోలీసుల కనుసన్నల్లోకి వెళ్లినట్లయింది. గూడాచారి వర్గాలు, రా(ఆర్ఏడబ్ల్యూ), కౌంటర్ ఇంటిలిజెన్స్, ఎన్ఐఏ, కేంద్ర, రాష్ట్ర నిఘా వర్గాలు అనుక్షణం ఆ ప్రాంతంలోని కదలికలను నిశితంగా గమనిస్తున్నాయి.

ప్రధాని పర్యటన సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా పోలీసు ఉన్నతాధికా రులు రాజధాని ప్రాంతంలో మకాం వేశారు. ముఖ్యంగా అదనపు డీజీతో పాటు ముగ్గురు ఐజీలు, నలుగురు డీఐజీలు, 35 మంది ఐపీఎస్ అధికారులను బందోబస్తుకు నియమించారు. దీంతో వారంతా మంగళవారం నుంచే

అదనపు డీజీతో సహా 35 మంది ఐపీఎస్‌లు రాజధానిలోనే..

తమకు కేటాయించిన ప్రాంతాల్లో విధుల్లో చేరారు. అదేవిధంగా మరో 15 మంది నాన్ కేడర్ ఎస్పీలు, మరో 15 మంది అదనపు ఎస్పీలు, 50 మంది డీఎస్పీలను నియమించారు. వీరందరికీ భద్రత విధులతో పాటు ట్రాఫిక్, పార్కింగ్, బారికేడ్‌లు, సభా వేదిక ప్రాంతాలు, సభకు వచ్చే వారికి అవసరమైన ఫలహారాలు, మంచినీరు, మజ్జిగ అందించే బాధ్యతలు అప్పజెప్పారు. మొత్తం మీద ప్రధాని పర్యటన నేపథ్యంలో సుమారు ఆరు వేల మంది పోలీసు అధికారులు, సిబ్బందిని బందోబస్తు చేయనున్నారు.

ప్రధాని సభా ప్రాంతానికి 9 రూట్లు

రాజధానిలో ప్రధాని మోదీ పాల్గొనే సభకు వెళ్లేందుకు ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండేలా 9 రూట్లను ఎంపిక చేశారు. అదేవిధంగా 12 పార్కింగ్ ప్రదేశాలను సిద్ధం చేశారు. ఆ ప్రాంతంలో లైటింగ్‌తో పాటు మైక్ సిస్టం కూడా పటిష్టంగా ఏర్పాటు చేశారు. మరోవైపు బహిరంగ ప్రదేశంలో సీటింగ్‌తో పాటు ఎల్ఈడీ స్క్రీన్‌లను కూడా ఉంచారు. వచ్చే వాహనాలకు, వెళ్లే వాహనాలకు ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేశారు. సభ ముగిసిన తర్వాత తిరుగు ప్రయాణంలో ట్రాఫిక్ సహా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నారు.

రాజధానిలో సాయుధ బలగాల మోహరింపు

పీఎం పర్యటన నేపథ్యంలో సాయుధ పోలీసు బలగాలు రాజధాని ప్రాంతంలో మోహరించాయి. చీమ చిటుక్కుమన్నా విరుచుకుపడేలా మెరికల్లాంటి ఎస్పీజీ బృందాలు రంగంలోకి దిగాయి. వీటితో పాటు గ్రేహౌండ్స్, ఆక్టోపస్, ఎస్‌పీఎఫ్, ఏపీఎస్పీ, సీఆర్‌పీఎఫ్‌తో పాటు ఆర్మ్‌డ్ రిజర్వ్ బృందాలు ఆ ప్రాంతంలో మోహరించాయి. అంతేగాక బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్, ఏరియా డామినేషన్ బృందాలు నిరంతరం ఆ ప్రాంతంలో గస్తీ తిరుగుతూ తనిఖీలు నిర్వహిస్తున్నాయి. మొత్తం మీద పీఎం పర్యటన దృష్ట్యా రాజధాని ప్రాంతం హై సెక్యూరిటీ జోన్‌లోకి చేరింది. దీంతో ఆ ప్రాంతమంతా పోలీసుల ఆధీనంలోకి చేరింది. ప్రధానికి ఆరంచెల భద్రత కల్పిస్తున్నారు. ఆయా భద్రతా ఏర్పాట్లను ఎప్పటికప్పుడు కేంద్ర హోంశాఖ నేతృత్వంలోని ఉన్నతాధికారుల బృందం నిరంతరం పర్యవేక్షిస్తోంది.

ఎస్ఆర్ఎమ్, విట్ , లాం చలపతిలో పోలీసులకు బస

రాష్ట్రవ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్‌ల నుంచి పెద్దసంఖ్యలో పో లీసులను ప్రధాని పర్యటన బందోబస్తుకు నియమించారు. వారం దరికి రాజధాని ప్రాంతంలో వసతి సదుపాయం కల్పించారు. పీఎం పర్యటించే ప్రాంతానికి సమీపంలో ఉన్న ఎస్ఆర్ఎమ్, విట్ కళాశాలలో అత్యధిక మందికి వసతి సదుపాయం కల్పించారు. అదేవిధంగా లాం లోని చలపతి విద్యాసంస్థల్లో పెద్ద సంఖ్యలో పోలీసు అధికారులు, సిబ్బందికి నివాస సదుపాయం కల్పించారు.

సీసీ కెమెరాలు, డ్రోన్లతో ప్రత్యేక నిఘా

పీఎం పర్యటన నేపథ్యంలో భద్రతా కారణాల రీత్యా పోలీసులు కంట్రోల్ రూమ్ నుంచి ఆ ప్రాంతంపై నిఘా వేశాయి. ఇందుకు గాను సీసీ కెమెరాలు, డ్రోన్‌లతో ఆ ప్రాంతంలోని పరిస్థితులను, అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గమనిస్తున్నారు. ముఖ్యంగా ప్రధాని పర్యటించే వీఐపీ మార్గంలో పెద్ద ఎత్తున సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పీఎం రావడానికి గంట ముందు వరకు ఆ ప్రాంతలో డ్రోన్‌లను వినియోగించనున్నారు.


ప్రధాన మంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న హోం మంత్రి అనిత, కలెక్టర్ నాగలక్ష్మి

తొలగించిన చోటే డాక్టర్ కోడెల విగ్రహం ఏర్పాటు

- వెల్లడించిన టీడీపీ జిల్లా కార్యాలయం
- 2న జయంతి సందర్భంగా ఆవిష్కరణ

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి): లింగంగుంట్లలోని ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిలో అభిమానులు ఏర్పాటు చేసిన నవ్యాంధ్రప్రదేశ్ తొలి శాసనసభాపతి డాక్టర్ కోడెల శివ ప్రసాదరావు విగ్రహాన్ని గతేడాది తొలగించారు. అదే చోట మళ్లీ అభిమానులు కోడెల విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. కోడెల జయంతి మే 2న విగ్రహం అవిష్కరించనున్నారు. ఈ విషయాన్ని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయం వెల్లడించింది. విగ్రహ అవిష్కరణకు పార్టీ నేతలు, కార్యకర్తలు హాజరు కావాలని కోరింది. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను విగ్రహావిష్కరణను అహ్వానించినట్లు కోడెల అభిమానులు మంగళవారం తెలిపారు. కోడెల విగ్రహం తొలగింపు అప్పట్లో టీడీపీలో పెద్ద వివాదానికి దారి తీసింది. ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు ఆదేశాల మేరకే విగ్రహం తొలగించామని అప్పటి ఆస్పత్రి అధికారులు వెల్లడంచడంతో అయన విమర్శలను ఎదుర్కొన్నారు. తొలగించిన చోటే కోడెల విగ్రహం ఏర్పాటు చేయాలని అయన అభిమానులు, పార్టీ నేతలు కోరారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ తదితర నేతలు కోడెల విగ్రహం ఏర్పాటు చేసి అయనకు తగిన గౌరవం కల్పిస్తామని నాడు హామీ ఇచ్చారు. నెలలు గడుస్తున్నా హామీ అమలు కాకపోవడంతో తొలగించిన.. ఆస్పత్రి స్టోర్ రూంలో పడేసిన కోడెల విగ్రహాన్ని అయన అభిమానులు తీసుకొచ్చి అక్కడే ఏర్పాటు చేశారు. అయన జయంతి రోజు విగ్రహం ఆవిష్కరించనున్నట్లు పార్టీ జిల్లా కార్యాలయం ప్రకటించడంతో వివాదంకి తెరపడినట్లయింది.

ప్రేక్షకులను ఆలోచింపజేస్తున్న నాటికలు


పేగు రాసిన శాసనం నాటికలోని ఓ సన్నివేశం

భట్టిప్రోలు (కొల్లూరు), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సామాజిక అంశాలపై రూపొందించిన నాటికలు ప్రేక్షకులను ఆలోచింపజేస్తున్నాయి. మండల పరిధిలోని పల్లెకోనలో పరుచూరి రఘుబాబు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరుగుతున్న నాటకోత్సవాలు మూడో రోజుకు చేరాయి. హైదరాబాద్ వారి అన్నదాత నాటకాన్ని మొదటిగా ప్రదర్శించారు. శివప్రసాద్ దర్శకత్వం వహించగా కొల్లా రాధాకృష్ణ ఆధ్వర్యంలో ప్రదర్శించారు. అన్నం పెట్టే రైతు నోట్లో అందరూ మట్టికొట్టేవాళ్లేనని.. అప్పుల ఊబిలో కూరుకుపోతున్న రైతులతో మాఫియా ముఠా గంజాయి పండిస్తూ వారిని దోషులుగా చట్టం ముందు నిలబెడుతున్నారని.. దీనివల్ల రైతాంగం మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందనే ఇతివృత్తంగా సాగిన నాటిక ప్రేక్షకులను ఆలోచింపజేసింది. చింతకింద శ్రీనివాసరావు రచించిన పేగు రాసిన శాసనం నాటికకు నాయుడు గోపి దర్శకత్వం వహించారు. గురజాడ కళా మందిర్ విజయవాడ వారి మూడవ నాటికగా మహా ప్రస్థానం ప్రదర్శించారు. ఈ నాటకాన్ని ఎం.సంజీవి రచించగా బిళ్లా నటరాజ్ దర్శకత్వం వహించారు. సామాజిక అంశాలతో సాగుతున్న నాటకాలు ప్రేక్షకాదరణ పొందుతున్నాయి.

తవ్వకాల్లో బయటపడిన దేవతామూర్తుల విగ్రహాలు



శ్రీనివాసులు, పద్మావతి అమ్మవారు

దాచేపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లిలోని ఎస్సీ కాలనీ వద్ద పోలేరమ్మ గుడి పునఃప్రతిష్ఠ కార్యక్రమాల్లో జరుగుతున్న తవ్వకాల్లో పంచలోహ విగ్రహాలు బయటపడ్డాయి. మంగళవారం హోమగుండం నేలపై తవ్వకాలు జరుపుతుండగా సుమారు 9 నుంచి 10 అంగుళాలు పొడవు కలిగి 200 గ్రాములకు పైగా బరువు కలిగిన పంచలోహ విగ్రహాలు గడ్డపారకు తగిలాయి. వెంటనే మాజీ సర్పంచ్ తంగెళ్ల శ్రీనివాసరావు, భక్తులు పరిశీలించగా శంకు చక్రాలు కలిగిన వెంకటేశ్వర్లు స్వామిగా, చేతిలో కమలంతో ఉన్న మూర్తిని పద్మావతి అమ్మవారిగా బావించి తక్షణమే పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమం జరుగుతుండగా స్వామి వారి ఉత్సవమూర్తులు లభించడం శుభపరిణామంగా భక్తులు బావిస్తున్నారు. స్థానిక భక్తులు టెంకాయలు కొట్టి పూజలు నిర్వహించారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

కత్తితో యువకుడి హల్‌చల్

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని క్రిస్టియన్‌పాలెం లైబ్రరీ వద్ద మంగళవారం ఉదయం మల్లెల బాల అనే యువకుడు కత్తితో హల్‌చల్ చేశాడు. సదరు సంఘటన సోషల్ మీడియాలో హల్చల్ చేయడంతో రెండో పట్టణ పోలీసులు తక్షణమే స్పందించి బాలను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ నెల 28న కొండవెల్లి రాజా అనే వ్యక్తితో స్వల్ప వివాదం నేపథ్యంలో బాల మంగళవారం కత్తితో హల్‌చల్ చేసినట్లు సమాచారం. కాగా ఈ విషయమై రెండో పట్టణ సీఐ హైమారావును వివరణ అడుగగా నిందితుడిపై ఎస్ఐ లేఖ ప్రియాంక కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళపై దాడిచేసిన భార్యాభర్తలపై కేసు నమోదు

యడ్లపాడు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మహిళపై దాడికి పాల్పడిన భార్యా భర్తలపై యడ్లపాడు స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. ఎస్ఐ టి.శివరామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఉప్పరపాలెం గ్రామానికి చెందిన డేరంగుల మల్లేశ్వరికి చెందిన నీటి డ్రమ్మును సమీప బంధువు పల్లపు కోటేశ్వరరావు ఈ నెల 23న అనుమతి లేకుండా తీసుకెళ్ళి ఉపయోగించుకున్నాడు. ఈ విషయమై ప్రశ్నించిన మల్లేశ్వరిపై కోటేశ్వరరావు దాడికి పాల్పడ్డాడు. చేతులతో కొట్టి గట్టిగా తోయడంతో గోడపై పడి గాయపడింది. అదే సమయంలో అక్కడకు వచ్చిన కోటేశ్వరరావు భార్య సుజాత కూడా మల్లేశ్వరిని దూషిస్తూ విచక్షణారహితంగా దాడిచేసింది. గమనించిన సమీపంలోని వ్యక్తులు ఆమెను రక్షించారు. అనంతరం గ్రామపెద్దల సలహాతో భర్త వెంకటేష్‌తో కలసి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ప్రాథమిక విచారణ అనంతరం నిందితులపై సోమవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

యడ్లపాడు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): యువతి అదృశ్యమైన సంఘటన మండలంలోని మర్రిపాలెంలో చోటుచేసుకుంది. ఎస్ఐ శివరామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మర్రిపాలెంకు యువతి (18) పదో తరగతి వరకు చదివి ఇంటివద్దే ఉంటోంది. ఈ నెల 14వ తేదీ రాత్రి అందరూ భోజనాలు చేసిన అనంతరం నిద్రపోయారు. మరుసటి రోజు తెల్లవారు జామున లేచినప్పుడు కుమార్తె కనిపించలేదు. వెంటనే వారు సమీప ప్రాంతాల్లో వెతకడంతోపాటు, చుట్టుపక్కల వారిని విచారించారు. బంధువులను విచారించినా కనిపించకపోవడంతో సోమవారం సాయంత్రం యువతి తండ్రి యడ్లపాడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేసుకుని విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

చిలకలూరిపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలోని వేలూరు గ్రామ పరిధిలో పొలాలలో కోతముక్క ఆడుతున్న ఆరుగురిని పోలీసులు మంగళవారం అరెస్టుచేశారు. వారి వద్ద నుంచి పోలీసులు రూ.36,300 నగదు, 4 మోటార్ సైకిళ్ళు, 52 పేకముక్కలను స్వాధీన పరుచుకున్నారు. చిలకలూరిపేట రూరల్ సీఐ బి.సుబ్బానాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐలు జి.అనిల్ కుమార్, టి.శివరామకృష్ణలు ఈ దాడులలో పాల్గొన్నారు.

విద్యార్థులకు చీఫ్‌విప్ జీవీ, కలెక్టర్ అభినందనలు

ఈపూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలలో మండలంలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన గోపాలుని నాగసాయి తేజ (586), జీ కీర్తన (580) మార్కులు సాధించినందుకు చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, కలెక్టర్ అరుణబాబు, ఎమ్మెల్యేలు చదలవాడ అరవిందబాబు, జూలకంటి బ్రహ్మారెడ్డిలు అభినందించారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సునీల్ చౌదరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీశ్రీకు ఘన నివాళి

నరసరావుపేట కల్చరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మహాకవి శ్రీశ్రీ 116వ జయంతిని మంగళవారం శ్రీనాథపరిషత్ సాహితీ పరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పల్నాడు రోడ్డులోని శాఖా గ్రంథాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత శ్రీశ్రీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వక్తలు శ్రీశ్రీ కవితలపై ప్రసంగించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ చేరెడ్డి మస్తాన్ రెడ్డి, గ్రంథాలయ అధికారి వై.రాధ, బి.మురళి, పరిశోధకులు డాక్టర్ రసూల్, రవికిరణ్, కేఎంఎల్ ప్రసాద్, షేక్ బాజీ మస్తాన్‌లు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని సాహితీ పరిషత్ కార్యదర్శి స్వర్ణ చిన రామిరెడ్డి నిర్వహించారు.

క్లుప్తంగా...

● ఈపూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోడెపూడివారిపాలెంలో గ్రామదేవత మద్దిరాలమ్మ అమ్మవారి తిరునాళ్ళ మంగళవారం ఘనంగా జరిగింది. ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, టీడీపీ నాయకులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. భారీ విద్యుత్ ప్రభలు నిర్మించి వాటిపై సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఎస్ఐ ఉమామహేశ్వరరావు బందోబస్తు నిర్వహించారు.

● ఈపూరు: మండలంలోని ఉప్పరపాలెం గ్రామంలో బుధవారం విగ్రహాల ప్రతిష్ఠా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. కోదండ రామస్వామి ఆలయాలు, అభయాంజనేయస్వామి, వెంకటేశ్వరస్వామి, గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సం జరుపుచున్నారు.

● రొంపిచర్ల: మండలంలోని వీర పట్నం సమీపంలో పెంచేసిన దద్దనాల ఆంజనేయ స్వామి తిరునాళ్ల మంగళవారం వైభవంగా జరిగింది. పూజలను అర్చకులు రాఘవేంద్ర శర్మ నిర్వహించారు. మహిళలు పొంగళ్ళు పొంగించి మొక్కుబడులు తీర్చుకున్నారు. అన్నదాన కార్యక్రమం జరిగింది. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. రొంపిచర్ల పోలీసులు బందోబస్తు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ఎన్టీఆర్ సుజల స్రవంతి

● రూ. 5 కోట్లు వెచ్చించిన ఎన్టీఆర్ ట్రస్ట్



చిలకలూరిపేట తాగునీటి చెరువు వద్ద ఉన్న ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం ప్లాంట్ భవనం

చిలకలూరిపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట ప్రాంత ప్రజలకు ఎన్టీఆర్ ట్రస్ట్ అందించిన వరం ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం. పల్నాడు జిల్లా మొత్తంలో ఒక్క చిలకలూరిపేటలోనే దీనిని ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ఇఫ్కో సంస్థ సహకారంతో నిర్వహిస్తున్నారు. చిలకలూరిపేటలో ఈ పథకం కోసం ముఖ్యమంత్రి సతీమణి భువనేశ్వరి ఎంతో చొరవ చూపారు. పేద, మధ్యతరగతి ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఈ పథకాన్ని రూపొందించారు. ఈ పథకం ద్వారా చిలకలూరిపేటలోని 8 వార్డులు, నియోజకవర్గంలోని 30 గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని నిర్ణయించారు. అప్పట్లో రాష్ట్ర మంత్రి హోదాలో ఉన్న ప్రత్తిపాటి పుల్లారావు పలు సంస్థల వద్దనుంచి సీఎస్ఆర్ నిధులను ఎన్టీఆర్ ట్రస్ట్‌కు ఇప్పించి ట్రస్టు ద్వారా ఈ పథకాన్ని అమలు చేసేందుకు విశేషంగా కృషి చేశారు. మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావు కూడా ఇందుకు సహకరించారు. రాష్ట్రంలో చిలకలూరిపేటతో సహా మొత్తం మూడుచోట్ల మాత్రమే ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం అమలులో ఉంది.

చెరువు వద్ద నీటి శుద్ధి ప్లాంట్ ఏర్పాటు

ఈ పథకం కోసం చిలకలూరిపేట తాగునీటి చెరువు వద్ద స్థలం కోసం, చెరువు నుంచి పైపులైన్ ద్వారా నీటిని ఇచ్చేందుకు చిలకలూరిపేట మున్సిపాలిటీతో ఎన్టీఆర్ ట్రస్ట్ వారు ఒక ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఎకరం స్థలంలో భారీ తాగునీటి ప్లాంటును నిర్మించారు. ట్యాంకర్లతో కూడిన ఐదు ట్రాక్టర్లను కేటాయించారు. వీటి ద్వారా పట్టణంలోని వివిధ వార్డులలో ఉన్న 10, గ్రామాలలో ఉన్న 15 అవుట్ లెట్లకు ట్యాంకర్లతో శుద్ధిచేసిన తాగునీటిని సరఫరా చేస్తారు. ఒక్కొక్క అవుట్ లెట్ ఏర్పాటుకు రూ.7 లక్షలు ఖర్చు చేశారు. వీటి ద్వారా ప్రజలకు రూ.5లకే 20 లీటర్ల నీటిని అందించేందుకు ఏర్పాటు చేశారు. ఇందుకోసం ప్రీపెయిడ్ కార్డులను కూడా ప్రజలకు అందచేశారు. 2017లో తొలుత ఈ పథకాన్ని ప్రారంభించారు. రెండు సంవత్సరాలపాటు ఈ పథకం బాగానే అమలయింది.


మిట్టపాలెంలో సుజల స్రవంతి ప్లాంట్ వద్ద నీటిని పట్టుకుంటున్న గ్రామ ప్రజలు

వైసీపీ హయాంలో పథకం నిలిపివేత

2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే ఈ పథకం నిలిచిపోయింది. పథకానికి సంబంధించిన నీటి ప్లాంటును మూసివేశారు. ప్లాంటుకు నీటి సరఫరాను బంద్ చేశారు. 2022లో ప్రత్తిపాటి పుల్లారావు జోక్యం చేసుకొని రూ.20 లక్షలు సొంత నిధులు ఖర్చుచేసి ప్లాంట్‌కు సమీపంలో పాడైపోయిన బోర్ల స్థానంలో రెండు కొత్త బోర్లు వేయించారు. మూలబడిన ప్లాంటుకు మరమ్మతులు చేయించారు. ప్లాంటును పునః ప్రారంభించేందుకు సిద్ధం చేశారు. అయితే ఇందుకు వైసీపీ నాయకులు మోకాలడ్డారు. పథకం పేరును మార్చాలని పట్టుబట్టారు. ఇందుకు అంగీకరించని ప్రత్తిపాటి ప్లాంటును ఎలాగైనా పునః ప్రారంభించడానికి ఏర్పాట్లుచేశారు. ఈ సందర్భంలో ప్లాంటు వద్దకు వెళ్లిన ప్రత్తిపాటిపైన, ఆయన అనుచరులపైన ఎస్సీ, ఎస్టీ వేధింపుల కేసులు పెట్టారు. దీనితో ఈ పథకం మళ్లీ మూలన పడింది. 2024లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరిగి ప్రత్తిపాటి జోక్యం చేసుకొని దీనిని గాడిలో పెట్టారు. కాంటినెంటల్ కాఫీ సంస్థ నుంచి రూ.15 లక్షలు, కేఎంఈ వరప్రసాద్ నుంచి రూ.10లక్షలు సీఎస్ఆర్ నిధులను సేకరించి ప్లాంటును గాడిలో పెట్టారు. ప్రస్తుతం చెరువు వద్ద నుంచి ప్లాంటు ఉన్న ప్రదేశానికి రూ.3లక్షల వ్యయంతో నీటి పైపులైను ఏర్పాటు చేస్తున్నారు. మొత్తం15 గ్రామాలలో పథకం అవుట్ లెట్లు ఉండగా ప్రస్తుతం 10 గ్రామాలకు మాత్రమే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. మిగిలిన గ్రామాలతో పాటు పట్టణంలో ఉన్న 10 అవుట్ లెట్లుకు కూడా త్వరలోనే పూర్తిస్థాయిలో నీటి సరఫరా చేయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. చుట్టుపక్కల ఉన్న గ్రామాల వారు కూడా ఆయా గ్రామాల్లోని అవుట్ లెట్ల వద్దకు వచ్చి తాగునీటిని తీసుకువెళుతున్నారు. ఎన్టీఆర్ సుజల స్రవంతి తాగునీటి ప్లాంట్ ద్వారా ప్రతిరోజు లక్షన్నర లీటర్ల శుద్ధిచేసిన నీటిని ప్రజలకు అందివ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.


ప్లాంట్ నుంచి తాగునీటిని సరఫరా చేసేందుకు ఏర్పాటుచేసిన ట్యాంకర్లు

మోదీ సభను విజయవంతం చేయండి

ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మే 2న అమరావతిలో జరిగే ప్రధాని మోదీ బహిరంగసభ విజయవంతానికి కూటమి పార్టీల నేతలంతా కలిసికట్టుగా కృషిచేయాలని స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు కోరారు. మోదీ సభా నిర్వహణ నియోజకవర్గ ఇన్‌చార్జ్, కావలి శాసనసభ్యుడు కావ్య కృష్ణారెడ్డితో కలిసి కూటమి పార్టీల నాయకులు, గ్రామ, మండల, నియోజకవర్గంలోని టీడీపీ ప్రధాన నాయకులతో మోదీ బహిరంగ సభ విజయవంతానికి అనుసరించాల్సిన విధివిధానాలపై మంగళవారం ఇక్కడ సమావేశమై చర్చించారు. మోదీచేతుల మీదుగా జరిగే ప్రజారాజధాని అమరావతి పునర్నిర్మాణ పనులు అనుకున్న లక్ష్యం ప్రకారం పూర్తయితే, ప్రపంచం గర్వించే రాజధానిని ప్రజలంతా చూస్తారని ప్రత్తిపాటి అన్నారు. లక్ష కోట్ల రూపాయల పనుల్ని సకాలంలో పూర్తిచేయాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. వైసీపీ అమరావతిపై విద్వేషం చిమ్మడం ఆపలేదని, ఇప్పటికీ సోషల్ మీడియాలో చిన్నచిన్న ఘటనలను భూతద్దంలో చూపుతూ ప్రజల మనసుల్లో విషబీజాలు నాటుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ కార్యకర్తలు వైసీపీ దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాలని, సోషల్ మీడియాలో చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ రాజధాని నిర్మాణంతో రాష్ట్రానికి పరిశ్రమలు, పెట్టుబడులు వచ్చి, భూముల ధరలు పెరిగి, ప్రజల జీవనచిత్రమే మారిపోతుందని చెప్పారు. రాజధాని నిర్మాణమనేది మనకోసం, మన బిడ్డల భవిష్యత్ కోసమనే వాస్తవాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు తోట రాజారమేష్, బీజేపీ నాయకులు టి.జయరామిరెడ్డి, టీడీపీ నాయకులు ధారునాయక్, షేక్ కరీముల్లా, ఇనగంటి జగదీష్, నెల్లూరి సదాశివరావు, పఠాన్ సమద్‌ఖాన్, జవ్వాజి మదన్‌మోహన్, కామినేని సాయిబాబు, వీరారెడ్డి, మద్దుమాల రవి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయాలి: లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు

శావల్యాపురం, ఏప్రిల్ 29 (ఆంధ్రప్రదేశ్): రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణ పనులను పునఃప్రారంభించేందుకు మే నెల 2వ తేదీన రాష్ట్రానికి విచ్చేస్తున్న ప్రధాని నరేంద్రమోడీ పర్యటనకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యేలా ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, అధికారులు సమన్వయంతో కృషిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర లిడ్ క్యాప్ చైర్మన్, వినుకొండ నియోజకవర్గ సమన్వయకర్త పిల్లి మాణిక్యరావు పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, అధికారులతో మంగళవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం కూటమి నాయకులు, అధికారులు మాణిక్యరావును దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. డీఎల్‌డీవో వెంకటరెడ్డి, ఎంపీడీవో సీతారామయ్య, టీడీపీ మండలాధ్యక్షుడు గుంటూరు సాంబశివరావు, బీజేపీ మండలాధ్యక్షుడు గట్టుపల్లి శ్రీనివాసరావు, జనసేన మండలాధ్యక్షుడు అడపాల అనిల్‌కుమార్, టీడీపీ నాయకులు గడిపూడి విశ్వనాధం, వై.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అమరావతికి తరలిరండి: అరవిందబాబు

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో మే 2న నరేంద్రమోడీ విచ్చేయనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఎమ్మెల్యే డాక్టర్‌చదలవాడ అరవిందబాబు అన్నారు. మంగళ వారం నరసరావుపేట టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో టీడీపీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ రాముల వారి పట్టాభిషేకం చూడానికి ఎలా వెళ్ళారో ప్రజలు అందరూ అమరావతి శంకుస్థాపనకు రావాలన్నారు. మాజీ ఎమ్మెల్యే కబ్జారెడ్డి అని కాసు ఫ్లెక్సీలు రోడ్డుమీద లేకుండా చేసిన దుర్మార్గుడు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి అని విమర్శించారు. డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తన సొంత గ్రామం బుచ్చిబాపన్నపాలెంలో అసభ్యమైన మాటలు మాట్లాడారని అది సరి కాదన్నారు. ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహన్‌కృష్ణ మాట్లాడుతూ మే 2న ప్రధాని నరేంద్రమోడీ సభని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంధాయల పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, మార్కెట్‌యార్డ్ చైర్మన్ పూనాటి శ్రీనివాసరావు, రంగిశెట్టి రామకృష్ణ, సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహన్‌కృష్ణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు తదితరులు

యువకుడి హత్య కేసులో నిందితుడికి రిమాండ్

శావల్యాపురం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గతేడాది మండలంలోని శానంపూడి గ్రామానికి చెందిన దళిత యువకుడు అమృతపూడి నాగేశ్వరరావును దారుణంగా హత్యచేసిన కేసులో నిందితుడిని గుర్తించి కోర్టులో హాజరుపరచగా అతనికి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ లేళ్ళ లోకేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు మృతుడు నాగేశ్వరరావు, వినుకొండ మండలం ఏనుగుపాలేనికి చెందిన దావులూరి బ్రహ్మయ్యలు 2024, అక్టోబరు 7వ తేదీన కారుమంచి సమీపంలోని అద్దంకి బ్రాంచ్ కెనాల్ వద్ద మద్యం సేవించి ఇద్దరూ ఘర్షణ పడ్డారు. బ్రహ్మయ్య నాగేశ్వరరావును కెనాల్‌లోకి తోయడంతో నీటిప్రవాహంలో కొట్టుకుపోయి మృతిచెందాడు. రెండ్రోజుల తర్వాత మార్టూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కొమ్మినేనివారిపాలెం వద్ద మృతదేహం లభ్యమవ్వగా మార్టూరు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. నాగేశ్వరరావు కనిపించడం లేదని ఆయన కుటుంబసభ్యులు శావల్యాపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా దాన్ని మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు. మార్టూరు పోలీసులు ఇచ్చిన సమాచారంతో శావల్యాపురం పోలీసులు మృతుడు నాగేశ్వరరావుగా గుర్తించి కేసును శావల్యాపురానికి బదిలీచేశారు. పోలీసులు దర్యాప్తులో దావులూరి బ్రహ్మయ్య హత్యచేసినట్లు గుర్తించి అదుపులోకి తీసుకొని, మూడ్రోజుల క్రితం నిందితుడిని కోర్టులో హాజరుపరచగా బ్రహ్మయ్యకు కోర్టు రిమాండ్ విధించినట్లు తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగుల రిలే నిరాహార దీక్షలు

వినుకొండ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న అన్ని సమస్యలు పరిష్కారం కావాలని స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఏపీపీటీడీ, నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం రిలే నిరాహార దీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎంయూ కార్యదర్శి నాయక్ మాట్లాడుతూ 1/2019 సర్క్యులర్ అమలు, ట్రాన్స్‌ఫర్స్ పాలసీ, అక్రమ సస్పెన్షన్లు, రిమూవర్స్, మహిళలకు చైల్డ్‌కేర్ సెలవులు, ఈహెచ్‌ఎస్ స్థానంలో పాత పద్ధతిలో వైద్యం, డిప్యూటేషన్ విధానం కొనసాగింపు, ఆగిపోయిన ప్రమోషన్ల పునరుద్ధరణ వంటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ముప్పాళ్ల శ్రీను, ఆర్.శ్రీను, మస్తాన్, సీతారెడ్డి, రామారావు, కృపారావు, ఇశ్రాయేలు, కీర్తి, విజయలక్ష్మి, మేరికుమారి, రేవతి తదితరులు పాల్గొన్నారు.

ఈపూరివారిపాలెంలో నేడు ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

ఈపూరివారిపాలెం (చిలకలూరిపేట), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలం ఈపూరివారిపాలెంలో బుధవారం ఉదయం10.16 గంటలకు శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించేందుకు గ్రామస్థులు ఏర్పాట్లు చేశారు. పురుషోత్తమపట్నం నుంచి ఆంజనేయస్వామి విగ్రహంతో శోభా యాత్రను ఈపూరివారిపాలెం వరకు నిర్వహించారు. యాగశాలలో మహాశాంతి హోమాన్ని నిర్వహించారు. బుధవారం విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా మహాపూర్ణాహుతి, శాంతి కల్యాణ మహోత్సవం, అన్న సమారాధన, కోలాట కార్యక్రమం ఏర్పాటు చేశారు.

చిత్ర యూనిట్‌కు కలెక్టర్, ఎమ్మెల్యే అభినందన

నరసరావుపేట కల్చరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) నిర్మాణంలో ఉన్న బాబూ జగ్జీవన్‌రామ్ చిత్ర యూనిట్‌ను మంగళవారం కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు సత్కరించారు. మంగళవారం చిత్రయూనిట్, పాత్రధారి మిలిటరీ ప్రసాద్ ఎమ్మెల్యే, కలెక్టర్‌లను కలిశారు. ఈ సందర్భంగా సినిమా దర్శకుడు దిలీప్ రాజా మాట్లాడుతూ సినిమాను 2025లో విడుదల చేస్తామని తెలిపారు.

రెండు వార్డుల టీడీపీ కార్యవర్గాల ఎన్నిక

చిలకలూరిపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సంస్థాగత ఎన్నికలలో భాగంగా పట్టణంలోని 12,17 వార్డులకు నూతన కార్యవర్గాలను ఎన్నిక జరిగింది. వార్డులకు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా 12వ వార్డుకు గేరా రాము, వడ్డాని జాషువ, 17వ వార్డుకు మచ్చా వెంకటేశ్వర్లు, నక్కా నరసింహారావు ఎన్నికయ్యారు.

పోలీసుల ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

నరసరావుపేట రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట రూరల్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన తాగునీటి చలివేంద్రాన్ని మంగళవారం నరసరావుపేట డీఎస్పీ కె.నాగేశ్వరరావు ప్రారంభించారు. స్థానిక పల్నాడు బస్టాండ్ వద్ద ఉన్న బైపాస్ రోడ్డులోని రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద మంగళవారం ఉదయం రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ సీహెచ్ కిషోర్ ఏర్పాటుచేసిన తాగునీటి చలివేంద్రాన్ని నరసరావుపేట పట్టణ డీఎస్పీ కే నాగేశ్వరరావు రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో బోరుగడ్డ అంబేడ్కర్ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు మాల మహానాడు, గ్రామాల ప్రజలు, విద్యార్థులు, పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధ్వర్యంలో...

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మంగళవారం చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా రీజనల్ హెడ్ టి.మాధురి మాట్లాడుతూ పెరుగుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకొని మరిన్ని చలివేంద్రాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజనల్ హెడ్ మురళి మోహన్, సోమేశ్వరరావు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ కేఎస్ రాంప్రసాద్, బ్రాంచ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


కుట్టు శిక్షణ పొందేందుకు వచ్చిన మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

ఆడబిడ్డలు స్వశక్తితో రాణించాలి

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

యడ్లపాడు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఆడబిడ్డలు స్వశక్తితో రాణించినప్పుడే రాష్ట్రప్రగతిలో కీలక భాగస్వాములు కాగలరని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. రాష్ట్ర బీసీ, ఈబీసీ కార్పొరేషన్‌ల సహకారంతో యడ్లపాడులో ఏర్పాటుచేసిన ఉచిత కుట్టుమిషన్ శిక్షణ తరగతుల్ని ప్రత్తిపాటి మంగళవారం ప్రారంభించారు. శిక్షణ తరగతులకు హాజరైన మహిళలతో మాట్లాడిన ప్రత్తిపాటి వారి కుటుంబ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టైలరింగ్‌తోపాటు అనుబంధ విషయాలలో నైపుణ్యాలను పెంపొందించుకుని స్వయం ఉపాధి పొందడమే కాకుండా చుట్టూ ఉన్నవారికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలన్నారు. పేద కుటుంబాలను వృద్ధిలోకి తేవడం కోసమే ముఖ్యమంత్రి చంద్రబాబు పీ-4 విధానాన్ని తీసుకొచ్చారన్నారు. మహిళలు తమకు ఆసక్తి ఉన్న అంశాలలో శిక్షణపొంది తమలోని ప్రతిభతో కుటుంబాలను తీర్చిదిద్దుకోవాలని ప్రత్తిపాటి సూచించారు. ఆ దిశగా ఆలోచించే మహిళల కోసమే ప్రభుత్వం ప్రత్యేకంగా వర్క్ ఫ్రం హోం విధానాన్ని తీసుకురానుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో హేమలతాదేవి, పంచాయితీ కార్యదర్శి శశికళ, మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రత్తిపాటిపై అభ్యంతరకర పోస్టులు... ఫిర్యాదు

చిలకలూరిపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఫేస్ బుక్, వాట్సాప్, ఎక్స్ తదితర సోషల్ మీడియాలలో మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావుపై అభ్యంతరకర పోస్టులు పెట్టి అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని అర్బన్ సీఐ పి.రమేష్ కు స్థానిక టీడీపీ నాయకులు పిల్లి కోటి తదితరులు మంగళవారం రాత్రి ఫిర్యాదుచేశారు. టీడీపీకి చెందిన ఉదయ్, వారి కుటుంబసభ్యుల మధ్య జరుగుతున్న అంతర్గత గొడవకు సంబంధించి ప్రత్తిపాటికి ఎటువంటి సంబంధం లేదని వారు పేర్కొన్నారు. అయితే ఈ విషయాన్ని ప్రత్తిపాటికి, టీడీపీకి ఆపాదిస్తూ పోస్టులు పెడుతున్నారని పేర్కొన్నారు. సోషల్ మీడియా చానళ్ళపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మాజీ మంత్రి కోడెల ఫైబర్ విగ్రహం తయారీ


విగ్రహంతో శిల్పులు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): తెనాలి సూర్య శిల్పశాల శిల్పులు మాజీ మంత్రి దివంగత కోడెల శివప్రసాదరావు ఫైబర్ గ్లాసు విగ్రహాన్ని రూపొందించారు. కోటప్పకొండలోని కమ్మ సత్రంలో ఆవిష్కరించేందుకుగాను పది అడుగుల ఎత్తులో ఈ విగ్రహాన్ని తయారు చేశారు. మే 2న కోడెల జయంతి పురస్కరించుకుని విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు, ఇందుకు గాను తమకు తయారీ ఆర్డర్ లభించిందని శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర తెలిపారు.

గుమ్మడికి మదర్ థెరిస్సా ఇండియన్ ఎక్సలెన్స్ అవార్డు


గుమ్మడి వెంకటేశ్వరరావు

వినుకొండ టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): బెంగళూరుకు చెందిన మదర్ థెరిస్సా ఫౌండేషన్ వారు మదర్ థెరిస్సా ఇండియన్ ఎక్సలెన్స్ అవార్డు 2025 సంవత్సరానికి ప్రకటించినట్లు మంగళవారం చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు గుమ్మడి వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. గత 22 సంవత్సరాల నుంచి సుమారు 7వేల పైచిలుకు కార్యక్రమాలు నిర్వహించినందుకు గాను ఫౌండేషన్ వారు ఈ అవార్డు ప్రకటించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులు, అభిమానులు, చైతన్య స్రవంతి కమిటీ సభ్యులు గుమ్మడిని అభినందించారు.